శివసూర్య

SHIVA SURYA TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

RNI APTEL : 2023/88704

కర్నూలు సంపుటి : 04, సంచిక : 08 ఛీఫ్ ఎడిటర్.. పేజీలు : 08, వెల రూ. 2రూ/ శుక్రవారం - 18 - సెప్టెంబర్ - 2026

Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad

మోదీ ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్.. ప్రధాని వాడిన ఆ పదాల అర్థమేంటో తెలుసా?

- ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్ వాడుతున్న ప్రధాని మోదీ
- యువతకు చేరువయ్యేందుకు కొత్త కమ్యూనికేషన్ వ్యూహం
- 'ఫ్లెక్స్', 'ఫోమో', 'ఓజీ' వంటి పదాల వినియోగం
- ఎన్‌ఆర్‌సీసీ, ఇండియా-డెన్మార్క్ సదస్సుల్లో ఈ పదాల ప్రస్తావన
- యువ ఓటర్లను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా విశ్లేషణ

వారణాసిలో చంద్రబాబు వాగ్ధాటి..
'VKS' మంత్రంతో సభికులను అలరించిన ఏపీ సీఎం

వారణాసిలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో చంద్రబాబు

- మోదీ పాలనను వివరిస్తూ 'VKS' మంత్రాన్ని ఆవిష్కరించిన సీఎం
- కాశీలో బాలాజీ ఆలయానికి 10 ఎకరాలు కేటాయించాలని విజ్ఞప్తి
- చంద్రబాబు ప్రసంగానికి రాజ్‌నాథ్ సింగ్ ప్రత్యేక అభినందనలు

అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా వారణాసిలో నిర్వహించిన 'కాశీ-వాద్‌నగర్ సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సభలో ఆయన తన వాగ్ధాటితో మిగతా 2 లో

తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు.. ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్ విడుదల
- మహబూబ్‌నగర్, వరంగల్ నియోజకవర్గాలకు ఎన్నికల ప్రక్రియ
- సెప్టెంబర్ 20 నుంచి నవంబర్ 6 వరకు దరఖాస్తుల స్వీకరణ

పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు జగన్ పై అనిత ఫైర్

- డీఎస్సీ నియామకాలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని అనిత మండిపాటు
- డీఎస్సీ పూర్తయిన ఏడాది తర్వాత బురద చల్లుతున్నారని ఆగ్రహం
- వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలుసని వ్యాఖ్య

తెలంగాణను ప్రపంచం గర్వించే
రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందాం

తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందాం

- ★ సెప్టెంబర్ 17వ తేదీ మన బాధ్యతను కూడా గుర్తు చేసే రోజు
- ★ ఈ చారిత్రక నేపథ్యం, ఉద్యమాల ఫలాలు ప్రజల జీవితాల్లో కనిపించాలి
- ★ రైతుకు భరోసా ఉండాలి. మహిళలు ఆర్థికంగా ఎదగాలి. అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలి

హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అభివృద్ధి చేరడానికి నాలుగు కోట్ల ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందామని అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు మాట్లాడారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అభివృద్ధి అన్ని ప్రాంతాలకు చేరాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యంగా చెప్పారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మిగతా 2 లో

రాష్ట్రంలో తీవ్ర కరవుపై
ముందస్తు చర్యలు శూన్యం
రాష్ట్రంలో కరవు పరిస్థితులపై జగన్ ఆందోళన

- కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం
- ఈ ఖరీఫ్‌లో సాగు 56.4 లక్షల ఎకరాలకే పరిమితమయిందన్న జగన్
- రైతులను నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న కరవు, వర్షాభావ పరిస్థితులపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని మిగతా 2 లో



చైనా నుంచి బయటకు వెళ్లడం ఇక అంత ఈజీ కాదు.. కొత్త రూల్స్‌తో షాక్!

- చైనాలో కొత్త నిష్క్రమణ ఆంక్షలు అమల్లోకి
- పౌరులు, విదేశీయుల ప్రయాణంపై అధికారులకు విస్తృత అధికారాలు
- జాతీయ భద్రత పేరుతో ఆంక్షలు విధించే అవకాశం
- నిబంధనలపై హెచ్‌ఆర్‌డబ్ల్యూ తీవ్ర ఆందోళన
- విదేశీయులపైనా గతంలో ఆంక్షలు విధించిన ఉదాహరణలు

2004 అఫిడవిట్‌లో ఒక్క ఎకరం లేదు..
కేసీఆర్ భూములపై పొంగులేటి సంచలన ప్రశ్నలు

- 2004 అఫిడవిట్‌లో కేసీఆర్‌కు భూమి లేదన్న పొంగులేటి
- ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయని ప్రశ్న
- కేసీఆర్ భూస్వామ్య కుటుంబంలో పుట్టారన్న బీఆర్ఎస్ వాదనపై కౌంటర్

రాజకీయాల్లో హుందాతనానికి ప్రతీక నాని..
మంత్రి లోకేశ్ భావోద్వేగ నివాళి

గుండెపోటుతో మరణించిన ఆళ్ల నానికి మంత్రి లోకేశ్ నివాళి

- రాజకీయాల్లో నాని హుందాగా వ్యవహరించారని కొనియాడిన లోకేశ్
- వ్యక్తిగత విమర్శలకు తావివ్వకుండా సమస్యలపైనే పోరాడారన్న మంత్రి
- నాని కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ తరఫున అండగా ఉంటామని హామీ
- లోకేశ్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా అంజలి

అమరావతి: మాజీ ఉప ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ నేత ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) మరణం పట్ల రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో హుందాతనానికి, మిగతా 2లో

కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై ప్రభుత్వం చర్యలు
సమీపంలోని ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారుల ఆరా
సర్వే నంబర్లు, పాత రికార్డుల సేకరణ
అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రకటనతో కదలిక

2004 అఫిడవిట్‌లో ఒక్క ఎకరం లేదు..
కేసీఆర్ భూములపై పొంగులేటి సంచలన ప్రశ్నలు

2004 అఫిడవిట్‌లో కేసీఆర్‌కు భూమి లేదన్న పొంగులేటి

- ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయని ప్రశ్న
- కేసీఆర్ భూస్వామ్య కుటుంబంలో పుట్టారన్న బీఆర్ఎస్ వాదనపై కౌంటర్
- ఎన్నికల అఫిడవిట్లలో ఆస్తుల పెరుగుదల కనిపిస్తోందన్న మంత్రి

బీఆర్ఎస్ పాలనలో ఆస్తులు ఎలా పెరిగాయని నిలదీత

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భూముల వ్యవహారంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2004 కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్‌లో తనకు ఒక్క ఎకరం భూమి కూడా లేదని కేసీఆర్ పేర్కొన్నారని గుర్తుచేశారు.

వారణాసిలో చంద్రబాబు వాగ్ధాటి.. 'VKS' మంత్రంతో సభికులను అలరించిన ఏపీ సీఎం

మొదటి పేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సభలో ఆయన తన వాగ్ధాటితో సభికులను ఉత్తేజపరిచారు. ప్రధాని మోదీ పాలన, దార్శనికత, దేశానికి అందిస్తున్న సేవలను వివరిస్తూనే, ఆంధ్రప్రదేశ్‌తో కేంద్ర ప్రభుత్వ బంధాన్ని బలంగా చాటిచెప్పారు. చంద్రబాబు ప్రసంగం ప్రారంభించకముందే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆయనను ప్రత్యేకంగా అభినందించడం, ప్రసంగం ముగిశాక "వెరీ వెరీ వెల్" అంటూ ప్రశంసించడం సభలో అందరి దృష్టిని ఆకర్షించింది. చంద్రబాబు తన ప్రసంగాన్ని హర హర మహాదేవ్ అంటూ ఆధ్యాత్మిక కోణంలో ఆరంభించడం విశేషం.

'VKS' మంత్రం.. సరికొత్త నినాదం

ప్రధాని మోదీ ప్రస్థానాన్ని వివరిస్తూ చంద్రబాబు 'వకస' అనే సరికొత్త మంత్రాన్ని ఆవిష్కరించారు. "వ అంటే మోదీ జన్మస్థలమైన వాద్‌నగర్, క అంటే ఆయన కర్మభూమి అయిన కాశీ, స అంటే ఆయన జన్మించిన సెప్టెంబర్ 17. ఈ 'వకస' మంత్రం ప్రజాస్వామ్యంలో అత్యంత శక్తివంతమైనది. సానుకూల దృక్పథంతో కృషి చేస్తే ఎవరైనా అత్యున్నత శిఖరాలను అధిరోహించవచ్చని మోదీ నిరూపించారు" అని చంద్రబాబు అన్నారు. సామాన్య కుటుంబంలో పుట్టి, రైల్వే స్టేషన్‌లో టీ అమ్ముతూ, కష్టపడి చదువుకుని దేశ ప్రధాని స్థాయికి ఎదగడం యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

అభివృద్ధి, సంక్షేమంలో మోదీ మార్క్

మోదీ నాయకత్వంలో గత పదేళ్లలో దేశంలో జరిగిన అభివృద్ధిని చంద్రబాబు అంకెలతో సహా వివరించారు. "మోదీ పాలనలో 25 కోట్ల మంది బహుముఖ పేదరికం నుంచి బయటపడ్డారు. 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు, 12 కోట్ల కుటుంబాలకు మరుగుదొడ్లు, 4 కోట్ల మందికి గృహ వసతి కల్పించారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించాలన్నది ఆయన కల. పీఎం కిసాన్ కింద 11 కోట్ల మంది రైతులకు మధ్యవర్తులు లేకుండా నేరుగా వారి ఖాతాల్లోకి నగదు బదిలీ చేశారు" అని తెలిపారు. కరోనా మహమ్మారి సమయంలో 140 కోట్ల మంది ప్రజల ప్రాణాలను కాపాడటమే కాకుండా, 100 దేశాలకు ఉచితంగా వ్యాక్సిన్లు అందించి మానవత్వాన్ని చాటుకున్నారని ప్రశంసించారు.

ఆత్మనిర్భర భారత్ నుంచి సాంకేతికత వరకు

రక్షణ రంగంలో భారత్ సాధించిన ప్రగతిని చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఒకప్పుడు రక్షణ పరికరాలను దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ నేడు మనమే సొంతంగా తయారు చేసుకుంటున్నాం. స్పేస్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, సెమీకండక్టర్, క్వాంటమ్ టెక్నాలజీ వరకు అన్నింటిపైనా అవగాహన ఉన్న ఏకైక నేత మోదీ" అని కొనియాడారు. స్టార్టప్‌ల ద్వారా యువత ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదిగిందని, మహిళా సాధికారతకు -బేటీ బచావో- నుంచి -లఖ్‌పతి దీదీ- వరకు అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు.

కాశీలో బాలాజీ ఆలయానికి స్థలం ఇవ్వండి

తన ప్రసంగంలో భాగంగా ఆయన అయోధ్య రామజన్మభూమి అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. దశాబ్దాలుగా నలుగుతున్న అయోధ్య వివాదాన్ని ప్రధాని నరేంద్ర మోదీ పరిష్కరించి, రామ మందిర కలను సాకారం చేశారని చంద్రబాబు కొనియాడారు. ఈ సందర్భంగా సభికులను ఉద్దేశించి "నేను చెప్పింది నిజమే కదా?" అని ప్రశ్నిస్తూ, అందరితో "జై శ్రీరామ్" అని గట్టిగా నినాదాలు చేయించారు. దీంతో వారణాసిలోని రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్ ఒక్కసారిగా ఆ నినాదాలతో మార్మోగిపోయింది.

ఈ సందర్భంగా చంద్రబాబు ఒక ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. "నేను పవిత్రమైన తిరుమల శ్రీ బాలాజీ కొలువైన నేల నుంచి వచ్చాను. ఈ చారిత్రక కాశీ నగరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలనుకుంటున్నాం. దీని కోసం 5 నుంచి 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కోరుతున్నాను" అని అన్నారు. ఈ ప్రకటనకు సభికుల నుంచి భారీ స్పందన లభించింది. అయోధ్యలో రామమందిర నిర్మాణం చరిత్రాత్మకమని, వారసత్వ సంపదను కాపాడుతూనే అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం మోదీకే సాధ్యమైందని చంద్రబాబు అన్నారు.

ఏపీకి అండగా ఎన్డీఏ

ఎన్డీఏ కూటమి బంధం విడదీయరానిదని చంద్రబాబు స్పష్టం చేశారు. "అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వం మాకు అండగా నిలిచింది. సహకార సమాఖ్య స్ఫూర్తి మాకు కేవలం నినాదం కాదు, అది మా రోజువారీ అనుభవం. మేం కలిసే ఉన్నాం, భవిష్యత్తులోనూ కలిసే ఉంటాం. మన ఐక్యతే దేశానికి బలం" అని పునరుద్ఘాటించారు. సరైన సమయంలో, సరైన ప్రదేశంలో, సరైన నాయకుడు ఉండటం దేశానికి లభించిన గొప్ప అదృష్టమని, ఆ నాయకుడే నరేంద్ర మోదీ అని చంద్రబాబు తన ప్రసంగాన్ని ముగించారు. ఆయన ప్రసంగానికి సభికులు లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలిపారు.

కేసీఆర్, కుటుంబ ఆస్తులపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు..

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ ఆస్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ముఖ్యమంత్రి విషప్రచారం చేస్తున్నారని, ఇందుకు ఆయన తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్‌కు ఉన్నది 1,000 ఎకరాలు కాదని, కేవలం 67 ఎకరాలు మాత్రమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రే అసెంబ్లీ వేదికగా అంగీకరించారని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ముఖ్యమంత్రికి ఓ సవాల్ విసిరారు. "కేసీఆర్ పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు మా కుటుంబం ఆస్తులపై పూర్తిస్థాయి విచారణకు మేము సిద్ధం. మరి పుట్టినప్పటి నుంచి మీ ఆస్తులపై విచారణకు మీరు సిద్ధమా?" అని రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ వ్యవసాయాన్ని ప్రేమించే నిజమైన రైతు అని, ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ ఆయన సాగు చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. కొందరు భూమిని ఒక వ్యాపార వస్తువుగా చూస్తే, కేసీఆర్ మాత్రం దానిని ఎంతో పవిత్రంగా భావిస్తారని పేర్కొన్నారు. చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములపై అనవసర రాద్ధాంతం చేస్తూ రేవంత్ రెడ్డి 'సెల్ఫ్ గోల్' చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. కేసీఆర్ తండ్రికి వందల ఎకరాల ఆస్తి ఉండేదని, చింతమడకలోని తమ పాత ఇంటిని ప్రభుత్వ పాఠశాల కోసం విరాళంగా ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. 22ఏ బాధితులకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగడతామని ఆయన పునరుద్ఘాటించారు.

పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు

అమరావతి: ఏపీలో డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పూర్తయి ఏడాది గడిచిన తర్వాత, కూటమి ప్రభుత్వంపై బురద చల్లేందుకు వైసీపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని అనిత మండిపడ్డారు. వైసీపీ అధినేత జగన్ పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధారమైన వ్యాఖ్యలు చేయడం అలవాటుగా మార్చుకున్నారని, అసలు వాస్తవాలు ఏమిటో ప్రజలకు స్పష్టంగా తెలుసని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే వీరికి తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. మరోవైపు, ఏపీపీఎస్సీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే వైసీపీ ఈ రాద్ధాంతం చేస్తోందని అప్పసాని రాజేశ్ ఆరోపించారు. డీఎస్సీ నియామకాలను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు వేసిన 320 కేసులను న్యాయస్థానం కొట్టివేసిందని గుర్తు చేశారు. గత ఐదేళ్ల పాలనలో 'జాబ్‌లెస్ క్యాలెండర్'తో యువతను మోసం చేసిన జగన్, ఇప్పుడు అత్యంత పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

రాజకీయాల్లో హుందాతనానికి ప్రతీక నాని..
మంత్రి లోకేశ్ భావోద్వేగ నివాళి

అమరావతి: మాజీ ఉప ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ నేత ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) మరణం పట్ల రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో హుందాతనానికి, రాజనీతికి ఆళ్ల నాని ప్రతీకగా నిలిచారని, ఆయన మరణంతో ఆంధ్రప్రదేశ్ ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందని అన్నారు. ఏలూరులోని ఆళ్ల నాని నివాసానికి చేరుకున్న లోకేశ్, ఆయన పార్థివదేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మీడియాతో మాట్లాడుతూ.. "ఆళ్ల నాని అన్న మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మంత్రిగా ఉన్న సమయంలో నేను ఎమ్మెల్సీగా శాసనమండలిలో ఉన్నాను. సభలో ఎన్నో అంశాలపై వాడివేడిగా చర్చించేవాళ్లం. కానీ, ఆయన ఏనాడూ వ్యక్తిగత దూషణలకు దిగలేదు. ప్రజా సమస్యలపై మాట్లాడటానికే సభ సమయాన్ని ఉపయోగించాలని బలంగా నమ్మిన వ్యక్తి ఆయన. రాజకీయాల్లో హుందాతనం ఎలా ఉండాలో ఆచరణలో చూపించారు" అని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా వివిధ హోదాల్లో ఆళ్ల నాని రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమని లోకేశ్ కొనియాడారు. "ముఖ్యంగా, ప్రపంచం గజగజలాడిన కోవిడ్ మహమ్మారి సమయంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా నాని అందించిన సేవలు మరువలేనివి. ఎన్నో సవాళ్లు, ఒత్తిళ్లు ఎదురైనా వాటిని అధిగమించి, ప్రజల ప్రాణాలను కాపాడటానికి, నమ్ముకున్న నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ఆయన అహర్నిశలు శ్రమించారు" అని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీలో ఆళ్ల నాని చేరిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ.. "మీరు క్రమశిక్షణ అనే పాఠశాలకు చెందినవారు. ఎప్పుడూ లక్ష్మణ రేఖ దాటని మీలాంటి వారిని చూసే మాలాంటి యువత రాజకీయాల్లోకి రావాలనుకుంటుంది అని నేను నాని అన్నతో చెప్పాను. అలాంటి గొప్ప వ్యక్తి ఈరోజు మన మధ్య లేకపోవడం అత్యంత బాధాకరం" అని లోకేశ్ అన్నారు. ఆళ్ల నాని కుటుంబానికి తెలుగుదేశం పార్టీ తరఫున, వ్యక్తిగతంగానూ ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆళ్ల నాని అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తున్నట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. మంత్రి కొలుసు పార్థసారథి ఏలూరులోనే ఉండి అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం, టీడీపీ తరఫున ఆళ్ల నానికి ఘన నివాళులు అర్పిస్తున్నామని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొలుసు పార్థసారథి, డా. నిమ్మల రామానాయుడు, ఎంపీ పుట్టా మహేష్ కుమార్, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, టీడీపీ నాయకులు పాల్గొని ఆళ్ల నానికి నివాళులర్పించారు.

తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందాం

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందామని అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు మాట్లాడారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అభివృద్ధి అన్ని ప్రాంతాలకు చేరాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యంగా చెప్పారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా 4 కోట్ల తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులకు ఈ చారిత్రక సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. "అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం మా ప్రజా పాలనకు పునాదులు. సెప్టెంబర్ 17వ తేదీ మన బాధ్యతను కూడా గుర్తు చేసే రోజు. ఈ చారిత్రక నేపథ్యం, ఉద్యమాల ఫలాలు ప్రజల జీవితాల్లో కనిపించాలి. రైతుకు భరోసా ఉండాలి. మహిళలు ఆర్థికంగా ఎదగాలి. అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలి. పేద బిడ్డకు మంచి చదువు, మంచి వైద్యం అందాలి. యువతకు ప్రపంచంతో పోటీ పడే అవకాశాలు రావాలి. తరతరాల అణిచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ. నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ఎప్పటికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలించింది. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యం అధికారికంగా భారతదేశంలో అంతర్భాగమైంది. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భం. అందుకే సెప్టెంబర్ 17ను మనం "ప్రజా పాలన దినోత్సవం"గా జరుపుకుంటున్నాం. ప్రజా పాలన అంటే ప్రజల మాటకు విలువ ఇవ్వడం... వారి సమస్యలకు పరిష్కారం చూపడం. వారి హక్కులను కాపాడడం. ప్రభుత్వ వనరులు అందరికీ చేరేలా చూడడం. అదే స్ఫూర్తితో ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ ప్రజా పాలన కొనసాగిస్తున్నాం. తెలంగాణ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలతో కాదు, ప్రపంచంతో పోటీ పడుతోంది. రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931కు చేరింది. ఇది దేశ తలసరి ఆదాయం కన్నా దాదాపు 91 శాతం అధికం. అభివృద్ధి అంకెల్లో మాత్రమే కాకుండా ప్రజల జీవితాల్లో కనిపించాలన్నదే మా లక్ష్యం. ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతి. ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేశాం. రూ.20,616 కోట్లు విడుదల చేసి 25.35 లక్షల రైతు కుటుంబాలను అప్పుల ఊబి నుంచి బయటపడేశాం. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేశాం.

సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాం. ప్రభుత్వం ఇచ్చిన మద్దతుతో వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలిచింది. 32 నెలల్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు రూ.1 లక్ష 72 వేల కోట్లు ఖర్చు చేశాం. భూ భారతి చట్టం ద్వారా భూ పరిపాలనలో సమగ్ర సంస్కరణలు తీసుకొచ్చాం. భూధార్, ఏఐ ఆధారిత భూమిత్ర సేవలు ప్రారంభించాం. 5 లక్షల 94 వేల మంది రైతులకు పట్టాదార్ పాస్‌బుక్‌లు జారీ చేశాం. కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటా కోసం న్యాయపోరాటం చేస్తున్నాం. పాలమూరు--రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతలు, ఎస్ఎల్‌బీసీతో పాటు ఇతర పెండింగ్ ప్రాజెక్టుల పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నాం. తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ సగర్వంగా జీవించాలి. ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలి. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మా ప్రభుత్వం పనిచేస్తోంది. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. ఈ ప్రయాణాలతో మన ఆడబిడ్డలకు రూ.12,385 కోట్ల మేర ఖర్చు ఆదా అయింది. గృహజ్యోతి కింద 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. 43 లక్షల కుటుంబాలకు రూ. 500కే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా 1 లక్ష 68 వేల మంది ఆడబిడ్డలకు రూ. 4,709 కోట్ల సహాయం చేశాం. 4.54 లక్షల స్వయం సహాయక సంఘాలకు రూ.60 వేల 487 కోట్ల బ్యాంకు లింకేజీ, రూ. 1,900 కోట్ల వడ్డీ రాయితీ కల్పించాం. మహిళా మార్ట్‌లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులతో మహిళల ఆదాయం పెంచుతున్నాం. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 3.42 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నాం. 15 లక్షలకు పైగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశాం. 43 లక్షలకు పైగా మందికి సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తున్నాం. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల కింద సుమారు రూ. 31 వేల కోట్లు అందించాం. తాజాగా మరో 2.25 లక్షల మందికి పింఛన్లు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో నివసించాలనేది మా ప్రభుత్వ ఆశయం. ఇందిరమ్మ ఇళ్ల తొలి దశలో రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. ఒక్కో ఇంటికి రూ. 5 లక్షలు అందించాం. రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. హైదరాబాద్ నగర పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ టవర్ల నిర్మాణాన్ని ప్రారంభించాం. సామాజిక అంతరాలను తగ్గించి ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనే లక్ష్యంతో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేను శాస్త్రీయంగా చేపట్టాం. ఆ సర్వే గణాంకాల ఆధారంగా విద్య, ఉపాధి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభలో ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపించాం. గౌరవ సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాం. ఫిబ్రవరి 4ను ప్రతి ఏటా "తెలంగాణ సోషల్ జస్టిస్ డే" గా జరుపుకుంటున్నాం. సామాజిక న్యాయం అంటే మాకు నినాదం కాదు. వెనుకబడిన వారిని ముందుకు తీసుకురావడం. ప్రజా ప్రభుత్వానికి విద్య, వైద్యం రెండు కళ్లలాంటివి. కుల, మత భేదాలు లేకుండా పిల్లలందరికీ నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మిస్తున్నాం.

ఒక్కో నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో సకల వసతులతో వీటి నిర్మాణం చేపడుతున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభించాం. ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించేందుకు రూ. 927 కోట్లు ఖర్చు చేస్తున్నాం. మధ్యాహ్న భోజనాన్ని 12వ తరగతి విద్యార్థుల వరకు విస్తరించాం. 11 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నాం. విద్యా రంగంలో తీసుకున్న చర్యలతో పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరుకుంది. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. అమెరికాకు చెందిన నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీతో పాటు బ్రిటన్‌లోని 17 స్వతంత్ర విద్యా సంస్థల సమాఖ్య యూనివర్సిటీ ఆఫ్ లండన్ తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌ల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశాయి. ఆరోగ్య రంగానికీ అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5 లక్షల 19 వేల మందికి రూ.2,526 కోట్ల సహాయం అందించాం. సామాన్యుడికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం మొదలైంది. సనత్‌నగర్‌లో మర్రి చెన్నారెడ్డి టిమ్స్ సూపర్? స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించుకున్నాం. అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం. వరంగల్‌లో 2 వేల పడకలతో టిమ్స్ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొస్తాం. తెలంగాణ ఉద్యమంలో యువత ముందుండి పోరాడింది. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కోసం పోరాడింది. 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పారదర్శకంగా పూర్తి చేశాం. గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాం. ఏఐతో ఉద్యోగాల స్వరూపం మారుతోంది. కొత్త నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది. అందుకే నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఐటీఐలను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసుకున్నాం. ఏటీసీలో శిక్షణ పొందిన విద్యార్థులు ఈరోజు క్యాంపస్? ప్లేస్?మెంట్స్ సాధిస్తున్నారు. పాలిటెక్నిక్ కాలేజీల్లోనూ కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నాం. మన యువత ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఎదగాలి. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను కూడా వేగంగా విస్తరిస్తున్నాం. రూ. 38,595 కోట్లతో 122.9 కిలోమీటర్ల మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు పంపించాం. ఆదిలాబాద్, మామునూరు విమానాశ్రయాలకు అనుమతులు సాధించాం. అవసరమైన భూసేకరణ చేపట్టాం. హైదరాబాద్ ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాలనే లక్ష్యంతో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు ప్రారంభించాం. 55 కిలోమీటర్ల పరిధిలో మూసీని పునరుజ్జీవింపజేస్తాం.

ప్రజల ఆరోగ్యంతో ఆడుకునే ఆహార కల్తీని ఎట్టి పరిస్థితుల్లో సహించం. అందుకే టీజీ సేఫ్ ఏర్పాటు చేసి కఠినంగా వ్యవహరిస్తున్నాం. యువత పెడదోవ పట్టకుండా రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు ఈగల్ వ్యవస్థను పటిష్ఠం చేశాం. ఈ రోజు అవసరాలు తీర్చడమే కాదు. మా లక్ష్యం రేపటి తెలంగాణను నిర్మించడం. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలను సాధించేందుకు ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనేది మా సంకల్పం. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే దిశగా అడుగులు వేస్తున్నాం. దాదాపు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని దేశంలో తొలి నెట్-జీరో స్మార్ట్ సిటీ నిర్మిస్తున్నాం. డిసెంబర్‌లో నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 సందర్భంగా ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తాం. ఫ్యూచర్ సిటీలో టీసీఎస్ రూ.70 వేల కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ నిర్మించేందుకు ముందుకు వచ్చింది. రూ.లక్ష కోట్ల పెట్టుబడితో అమెజాన్ ఇప్పటికే డేటా సెంటర్ నిర్మాణం చేపట్టింది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, లైఫ్ సైన్సెస్ హబ్, ఈవీ పార్క్, ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఎడ్యుకేషన్ సిటీ వంటి ప్రత్యేక జోన్లతో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నాం. రీజినల్ రింగ్ రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, డ్రైపోర్టులు, హైదరాబాద్--నాగపూర్, హైదరాబాద్--బెంగళూరు, హైదరాబాద్--విజయవాడ పారిశ్రామిక కారిడార్లు తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చనున్నాయి. రహదారులు అభివృద్ధికి సూచిక. గ్రామం నుంచి మండలానికి, మండలం నుంచి జిల్లాకు, జిల్లా నుంచి రాష్ట్ర రాజధానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించేందుకు పనులు చేపట్టాం. ఆర్ అండ్ బీ పరిధిలో రూ.13 వేల కోట్లతో, పంచాయతీరాజ్ పరిధిలో రూ. 6,294 కోట్లతో రహదారి పనులు చేపడుతున్నాం. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. విద్యుత్ డిమాండ్ కూడా పెరిగింది. తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తున్నాం. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజల నుంచి కూడా సహకారం ఆశిస్తున్నాం. వీబీ జీ రామ్ జీలో ఎక్కువ పని దినాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం" అని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు.

రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం
కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న కరవు, వర్షాభావ పరిస్థితులపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లాల వారీగా పరిస్థితులపై సమీక్ష జరిపారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని, మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఖరీఫ్‌లో సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి పాత బకాయిలైన రూ.3,000 కోట్లను విడుదల చేయాలన్నారు. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెండింగ్‌లో ఉన్న రూ.41,000 చెల్లించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6,000 కోట్లు అందించాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. సాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబడుతూ, పోలవరం నిల్వ సామర్థ్యంపై రాజీపడుతూ ఉనికి కోసం లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. కరవు బారిన పడిన గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉచిత ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైసీపీ క్షేత్రస్థాయి కార్యాచరణ చేపడుతుందని, త్వరలోనే తాను స్వయంగా కరవు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

చైనా నుంచి బయటకు వెళ్లడం ఇక అంత ఈజీ కాదు..

ఢిల్లీ: చైనా ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దేశ పౌరులతో పాటు విదేశీయులు చైనా నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకునే అధికారం అధికారులకు ఈ నిబంధనలు కల్పిస్తున్నాయని హ్యూమన్ రైట్స్ వాచ్ (హెచ్‌ఆర్‌డబ్ల్యూ) తెలిపింది. ఈ నిర్ణయం అంతర్జాతీయంగా గుర్తించిన దేశాన్ని విడిచి వెళ్లే హక్కుకు విరుద్ధంగా ఉందని పేర్కొంది. సెప్టెంబరు 15 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. జాతీయ భద్రత, ప్రమాదాల పేరుతో, స్పష్టత లేని కారణాలతో ప్రయాణాన్ని అడ్డుకునే అవకాశం అధికారులకు కల్పించారని హెచ్‌ఆర్‌డబ్ల్యూ ఆరోపించింది. దేశం విడిచి వెళ్లడంపై ఆంక్షలు విధించాలంటే అవి అవసరమైనవి, సముచితమైనవిగా ఉండాలని అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలు చెబుతున్నాయని సంస్థ పేర్కొంది. హెచ్‌ఆర్‌డబ్ల్యూ ఆసియా విభాగం డిప్యూటీ డైరెక్టర్ మాయా వాంగ్ ఈ నిర్ణయంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరిని దేశం నుంచి బయటకు వెళ్లనివ్వాలి? ఎవరిని అడ్డుకోవాలి? అన్నది అధికారులు తమ ఇష్టానుసారం నిర్ణయించే పరిస్థితి ఏర్పడుతోందని ఆమె అన్నారు. మానవ హక్కుల కార్యకర్తలు, కొన్ని మైనారిటీ వర్గాల అంతర్జాతీయ ప్రయాణాలపై ఇప్పటికే చైనా అధికారులు నిఘా, ఆంక్షలు పెంచారని తెలిపారు. విదేశీయులపైనా ఇదే పరిస్థితి ఉండొచ్చని హెచ్‌ఆర్‌డబ్ల్యూ హెచ్చరించింది. 2025 జులైలో ఓ అమెరికా ప్రభుత్వ ఉద్యోగి, వెల్స్ ఫార్గో బ్యాంక్ అధికారి చైనా నుంచి బయటకు వెళ్లకుండా అధికారులు అడ్డుకున్నారని పేర్కొంది. వారిపై ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదు కాలేదని తెలిపింది. చైనా గత దశాబ్దంలో దేశం విడిచి వెళ్లే విషయంలో ఆంక్షలను క్రమంగా పెంచిందని హెచ్‌ఆర్‌డబ్ల్యూ పేర్కొంది. ముఖ్యంగా మతపరమైన మైనారిటీలు, మానవ హక్కుల కార్యకర్తలపై ప్రయాణ పరిమితులు పెరిగాయని తెలిపింది. 2016లో జిన్‌జియాంగ్ అధికారులు గతంలో జారీ చేసిన పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్న తర్వాత మైనారిటీ ఉయ్‌గర్ ముస్లింల విదేశీ ప్రయాణంపై ఆంక్షలు మరింత తీవ్రమయ్యాయని చెప్పింది. కొత్త నిబంధనలు భావ వ్యక్తీకరణ, విద్యా స్వేచ్ఛపై కూడా ప్రభావం చూపొచ్చని హెచ్‌ఆర్‌డబ్ల్యూ ఆందోళన వ్యక్తం చేసింది. దేశం విడిచి వెళ్లకుండా అడ్డుకుంటారనే భయంతో చైనా పౌరులు, విదేశీయులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడంలో వెనుకడుగు వేసే అవకాశం ఉందని పేర్కొంది.

కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి..
రంగంలోకి రెవెన్యూ అధికారులు

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఫామ్‌హౌస్ భూములపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఫామ్‌హౌస్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల సర్వే నంబర్లు, గతంలో ఆ భూములను సాగు చేసిన రైతుల పేర్లు, ప్రస్తుత భూ రికార్డుల వివరాలతో అధికారులు సమగ్ర నివేదికలను రూపొందిస్తున్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటనకు అనుగుణంగానే అధికారులు ఇప్పుడు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంపై దృష్టి పెట్టారు. కేసీఆర్ భూముల విస్తీర్ణం, వాటి స్వరూపంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు..
ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల

హైదరాబాద్: తెలంగాణలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానాలకు ఓటర్ల నమోదు ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 20న ఓటర్ల నమోదుకు సంబంధించి పబ్లిక్ నోటీసు జారీ చేయనున్నారు. అప్పటి నుంచి నవంబర్ 6 వరకు అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు గడువు ఉంటుంది. వీటిని పరిష్కరించిన అనంతరం, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఒక కీలక విషయాన్ని స్పష్టం చేశారు. గతంలో పట్టభద్రుల ఓటరుగా పేరు నమోదు చేసుకున్న వారు కూడా తప్పనిసరిగా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాత ఓటు రద్దవుతుందని, కొత్త జాబితాలో పేరు నమోదైతేనే ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ప్రస్తుతం ఈ రెండు స్థానాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీలు వాణీదేవి, తీన్మార్ మల్లన్నల పదవీకాలం వచ్చే ఏడాది మార్చి నెలతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియను ప్రారంభించింది.

2004 అఫిడవిట్‌లో ఒక్క ఎకరం లేదు..
కేసీఆర్ భూములపై పొంగులేటి సంచలన ప్రశ్నలు

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భూముల వ్యవహారంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2004 కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్‌లో తనకు ఒక్క ఎకరం భూమి కూడా లేదని కేసీఆర్ పేర్కొన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల భూస్వామ్య కుటుంబంలో జన్మించారంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలకు ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ స్వయంగా సమర్పించిన ఎన్నికల అఫిడవిట్లను గతంలో ఎక్స్‌లో పంచుకున్న పొంగులేటి.. తెలంగాణ ఉద్యమ కాలంలో, ఆ తర్వాత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆయన ఆస్తులు భారీగా పెరిగాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల అఫిడవిట్లే స్పష్టం చేస్తున్నాయని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు అప్పులు మిగిలితే.. కేసీఆర్ కుటుంబానికి మాత్రం లక్షల కోట్ల విలువైన ఆస్తులు ఎలా వచ్చాయని పొంగులేటి ప్రశ్నించారు. ప్రభుత్వ భూములు, పేదలు, దళితులకు చెందిన అసైన్డ్ భూములను దోచుకోవడం వల్లే ఈ ఆస్తులు వచ్చాయా అని నిలదీశారు. అయితే ఇవన్నీ ఆరోపణలేనని, వాటిపై సంబంధిత ఆధారాలు లేదా అధికారిక నిర్ధారణను పొంగులేటి తన పోస్టులో వెల్లడించలేదు. ఉద్యమకారుల త్యాగాల పునాదులపై కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు కూడబెట్టుకుందని పొంగులేటి ఆరోపించారు. కేసీఆర్‌కు పుట్టుకతోనే వందల ఎకరాలు ఉన్నాయని కేటీఆర్ చెబుతున్నారని, మరి 2004 ఎన్నికల అఫిడవిట్‌లో ఆ వివరాలు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఎన్నికల అఫిడ విట్‌లో తప్పులు రాశారా? లేక ప్రజలకు తప్పుడు సమాచారం చెబుతున్నారా? అని కేటీఆర్‌ను పొంగులేటి నిలదీశారు.

మోదీ ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్..
ప్రధాని వాడిన ఆ పదాల అర్థమేంటో తెలుసా?

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగ శైలిలో మార్పులు చేస్తూ, యువతకు మరింత చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా, నేటి తరం యువత (జెన్-జీ) ఎక్కువగా వాడే ఆధునిక పరిభాషను, స్లాంగ్ పదాలను తన ప్రసంగాల్లో ఉపయోగిస్తూ అందరినీ ఆకర్షిస్తున్నారు. ఆయన ప్రసంగాల్లో ఈ కొత్త పదజాలం వాడటం వెనుక, యువ ఓటర్లను ఆకట్టుకోవాలనే స్పష్టమైన వ్యూహం కనిపిస్తోంది. ఇటీవల ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ కళాశాల పూర్వ విద్యార్థులను 'ఓజీ' లుగా అభివర్ణించారు. జెన్-జీ పరిభాషలో 'ఓజీ' అంటే 'ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్' అని అర్థం. అంటే తమ రంగంలో అత్యంత ప్రావీణ్యం ఉన్నవారిని, ప్రత్యేకమైన వారిని గౌరవంగా ఇలా పిలుస్తారు. ఇదే ప్రసంగంలో 'ఫ్లెక్స్' అనే పదాన్ని కూడా ఆయన వాడారు. "ఈ రోజుల్లో కూడా ఢిల్లీ యూనివర్సిటీలో మీరు ఎస్ఆర్‌సీసీ విద్యార్థి అని చెప్పుకోవడం ఒక 'ఫ్లెక్స్' లాంటిది" అని ఆయన వ్యాఖ్యానించారు. తమకున్న హోదాను, నైపుణ్యాన్ని లేదా విజయాన్ని గర్వంగా ప్రదర్శించడాన్ని 'ఫ్లెక్స్' అంటారు. ఇంతకుముందు 2022లో డెన్మార్క్ ప్రధానితో కలిసి ఇండియా-డెన్మార్క్ బిజినెస్ ఫోరమ్‌లో ప్రసంగిస్తూ ప్రధాని 'ఫోమో' (ఫీమో) అనే పదాన్ని ప్రస్తావించారు. 'ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్' అనే పదబంధానికి సంక్షిప్త రూపమే ఈ 'ఫోమో'. సోషల్ మీడియాలో ఈ పదం చాలా ప్రాచుర్యం పొందింది. భారత్‌లో పెట్టుబడులు పెట్టని వారు గొప్ప అవకాశాన్ని కోల్పోతారని, వారు 'ఫోమో'కు గురవుతారని చెప్పడానికి మోదీ ఈ పదాన్ని చమత్కారంగా ఉపయోగించారు. ప్రధాని మోదీ ఈ తరహా పదాలను ఉపయోగించడం ఒక విస్తృత కమ్యూనికేషన్ వ్యూహంలో భాగమని విశ్లేషకులు భావిస్తున్నారు. సోషల్ మీడియా, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ తరహా కంటెంట్‌తో యువతను ఆకట్టుకోవడం దీని ప్రధాన ఉద్దేశం. సంప్రదాయ రాజకీయ ప్రసంగాలకు భిన్నంగా, మారుతున్న కాలానికి అనుగుణంగా తనను తాను మలచుకుంటూ యువతరంతో మమేకం అయ్యేందుకు మోదీ చేస్తున్న ఈ ప్రయత్నం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

పోషకాహారంతోనే సంపూర్ణ ఎదుగుదల మరియు ఆరోగ్యం

నందవరం,శివసూర్య, సెప్టెంబర్ 17: నందవరం మండలం నాగలదిన్నె గ్రామంలో ఐసీడీస్ డిపార్ట్మెంటు, హెల్త్ డిపార్ట్మెంటు మరియు ఆర్డిప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వైవిధ్యభరితమైన ఆహార పదార్థాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడంజరిగింది. డాక్టర్ జి.రవిచంద్ర కుమార్ సార్ మాట్లాడుతు

చిన్నారులు,గర్భవతులు, బాలింతలు ,వృద్ధులు మీరు తినే ఆహారంతోనే సంపూర్ణ ఎదుగుదల మరియు ఆరోగ్యం సాధ్యమని అన్నారు. అన్ని రకాల పండ్లు తినడం వల్ల రక్తము వృద్ధి చెందుతుందని త ె లి య ి ం ఏ ి ం ి చ ా డ ి ం . చిరుదన్యాలు,ఆకుకూరలు కూరగాయలు, పండ్లు తినడం వల్ల,ప్రోటీన్లు ఐరన్ పోషకాలు, విటమిన్స్, మినరల్స్ ఖనిజ లవనాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. శరీరానికి కావలసిన శక్తిని మరియు తల్లి బిడ్డల ఎదుగుదలకు సమగ్రంగా ఉపయోగపడతాయని అన్నారు. సి ఆర్ పి ఉసెని మాట్లాడుతూ పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం,ఆరోగ్య భద్రత ఉంటుందని మెరుగైన ఆరోగ్య సూత్రాలు పాటించడం,సమతుల్యమైన ఆహారం తినాలని ఇంటిని ఇంటి చుట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. కిచెన్ గార్డెన్ దగ్గర పురుగుమందు రహిత కూరగాయలు ఆకుకూరలు పండించుకోవాలని, ప్లాస్టిక్ కవర్లు వాడా కూడదు, నీటిని వేడి చేసుకుని చల్లార్చుకొని తాగాలని ఆహార పదార్థాల పైన మూతలు ఉంచుకోవాలని తెలియపరిచాడు. అంగన్వాడి టీచర్ మునేశ్వరమ్మ మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్ గర్భవతులకు బాలింతలకి ఇచ్చేటువంటి బాల సంజీవని కిట్టు పూర్తిగా వివరిస్తూ కంపల్సరీ గర్భవతులు బాలింతలు తినాలి తల్లి బిడ్డల క్షేమం కొరకు బాల సంజీవని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి పాల్గొన్నవారు డాక్టర్ జి.రవిచంద్ర కుమార్,సి ఆర్ పి ఉసెని,అంగన్వాడీ టీచర్లు మునేశ్వరి, తులాసమ్మ, క్రిష్టియన, జ్యోతి మరియు ఆయలు.

విలేకరులపై దౌర్జన్యాన్ని సహించేది లేదు..

:- పత్తికొండ అర్బన్ సీఐ జయన్నను సస్పెండ్ చేయాలి..

:-విలేకరులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి..

:- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన..

నందవరం,శివసూర్య, సెప్టెంబర్ 17:విలేకరులపై పోలీసుల దురుసు ప్రవర్తనను, వేధింపులను, అక్రమ కేసులను తక్షణమే అరికట్టాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. పత్తికొండ విశాలాంధ్ర విలేకరి నాగరాజుపై అర్బన్ సీఐ జయన్న దురుసుగా ప్రవర్తించి, అనుచిత పదజాలంతో దూషిస్తూ మెడ పట్టుకుని బయటకు నెట్టివేశారని ఆరోపిస్తూ గురువారం నందవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ అబ్దుల్ వాహబ్ కు వినతిపత్రం అందజేశారు. నంద్యాల జిల్లాకు చెందిన ఐ న్యూస్ స్టాఫ్ రిపోర్టర్ బసవరాజుతో పాటు విలేకరులపై అక్రమ కేసులు నమోదు చేసినట్లు పేర్కొంటున్న కేసులను కూడా వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే నాయకులు మాట్లాడుతూప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే విలేకరులపై దౌర్జన్యంగా వ్యవహరించడం, అనుచిత పదజాలంతో మాట్లాడటం, బెదిరింపులకు పాల్పడటం, కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. పత్తికొండ అర్బన్ సీఐ జయన్న వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, వేధింపులు పునరావృతం కాకుండా పోలీసు ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే మీడియా ప్రతినిధుల హక్కులు, గౌరవాన్ని కాపాడేలా ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు స్పందించాలని అన్నారు. విలేకరులపై దౌర్జన్యానికి పాల్పడే వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఏపీయూడబ్ల్యూజే నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఉరుకుంద, సోమన్న, ఉపేందర్ రెడ్డి, గోవింద, బీమన్న, నాగేష్, సిపిఐ నాయకులు సోమేశ్వర్ రెడ్డి, గిడ్డయ్య, శాంతన్న తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవి, ఎస్టిఐ అంశాలపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన సదస్సు

ఐజ,శివసూర్య సెప్టెంబర్ 17:తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (బూూజూ) ఆదేశానుసారం 'హోప్ టి.ఐ' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఐజ మండల పరిధిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని పులికల్లు, రాజాపురం గ్రామాలతో పాటు పులికల్లు జెడ్పీహెచ్ఎస్, మేడికొండ జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలు, ఐజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్ఐవి/ఎయిడ్స్, ఎస్టిఐ (లైంగిక సంక్రమణ వ్యాధులు) లపై విద్యార్థులకు, ప్రజలకు చైతన్యం కలిగించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ స్వయంగా తమ హెచ్ఐవి ముప్పు స్థాయిని తెలుసుకునే 'హెచ్ఐవి సెల్ఫ్ రిస్క్ అసెస్మెంట్' (ఎ×ఎ నావశ్రీట--=అంఎ౨ూంంవంంఎవత్) క్యూఆర్ కోడ్ (ు= జశీసవ) ఉపయోగం మరియు దాని ప్రాముఖ్యత గురించి విస్తృతంగా వివరించారు. ఈ కార్యక్రమంలో హోప్ టి.ఐ సంస్థ ప్రతినిధులు (నా=జౌ) మనోహర్, అశోక్, చెర్రీ , సంబంధిత గ్రామాల ప్రజలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు

దుర్గా నగర్‌లో ఘనంగా అన్న ప్రసాద వితరణ

ఐజ,శివసూర్య సెప్టెంబర్ 17 : జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ 10వ వార్డు దుర్గా నగర్ కాలనీలో కౌన్సిలర్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దుర్గా నగర్ కాలనీ ప్రజల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వరసిద్ధి వినాయక స్వామివారికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించి, దుర్గా నగర్ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్వామివారికి వివిధ ప్రసాదాలను నివేదించి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆచార్య చక్రవర్తి చార్యులు ప్రజలకు మంగళాశాసనాలు అందజేశారు. కార్యక్రమంలో రాధమ్మ, కృష్ణ, జంగం కె. రవిశేఖర్, పరశురాముడు, నరసింహ, గణేష్, పరుష, వీరేష్ తదితరులతో పాటు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

తుప్పత్రాలలో అభయ వరసిద్ధి వినాయక స్వామికి ప్రత్యేక పూజలు

అలంపూర్, శివసూర్య సెప్టెంబర్ 17 : జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ 6వ వార్డు తుప్పత్రాల గ్రామంలో కొలువుదీరిన అభయ వరసిద్ధి వినాయక స్వామి మండపంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దంపతులు శ్రీదేవి-- రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమానికి ధూప దీప నైవేద్య అర్చక సంఘం జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని గజమాలతో సుందరంగా అలంకరించి, భక్తులకు మంగళాశాసనాలు అందించారు. ఈ సందర్భంగా ఆచార్య చక్రవర్తి చార్యులు మాట్లాడుతూ విఘ్నాలను తొలగించి భక్తుల సంకల్పాలను నెరవేర్చే విఘ్నేశ్వరుని అనుగ్రహం ప్రతి కుటుంబంపై ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రత్యేక పూజల సందర్భంగా వినాయక మండపం భక్తుల ఆధ్యాత్మిక సందడితో కళకళలాడింది. కార్యక్రమంలో తుప్పత్రాల వినాయక స్వామి కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తాదులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణవేణి పాఠశాల ప్రిన్సిపల్ దంపతులకు ఆచార్య చక్రవర్తి మంగళాశాసనాలు

గద్వాల,శివసూర్య సెప్టెంబర్ 17:జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజా మున్సిపాలిటీలోని శ్రీ కృష్ణవేణి ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపల్ మధుసూధన్ రెడ్డి దంపతులను ధూప దీప నైవేద్య జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు ఘనంగా సత్కరించి, మంగళాశాసనాలు అందించారు. తుప్పత్రాల గ్రామంలోని శ్రీ అభయ వరసిద్ధి వినాయక స్వామి మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రిన్సిపల్ మధుసూధన్ రెడ్డి దంపతులకు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందించారు. విద్యా రంగంలో మరింత ఉన్నతంగా రాణిస్తూ, విద్యార్థులకు మంచి విద్యతో పాటు విలువలు, సంస్కారం అందించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కృష్ణవేణి పాఠశాల సిబ్బంది, తొమ్మిదో తరగతి, పదో తరగతి విద్యార్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నిజాం గుండెల్లో తెలంగాణ జెండా ఎగిరిన రోజు.

గట్టు (శివసూర్య) తెలంగాణలో అత్యంత దుర్మార్గ పాలనకు చరమగీతం పాడిన రోజు. గట్టు మండలం మాచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయం లో ప్రజా పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించరు. హాజరైన మాచర్ల గ్రామ సర్పంచ్ బి వజ్రమ్మ తిమ్మప్ప. సర్పంచ్ వజ్రమ్మ తిమ్మప్ప,

మాట్లాడుతూ,నిజాంఅనే నిరంకుశ వాది, తెలంగాణ ప్రజల మాన, ప్రాణ లతో చెలగాటమాడిన, నిజాం దుర్మార్గ పాలనలో తెలంగాణ ప్రజలు ఎన్నో కష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎంతోమంది మహిళలు తమ మానప్రాణాలు పోగొట్టుకున్నారు. వెట్టి చాకిరీ, దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా రైతులు, కూలీలు, మహిళలు, యువత ఒక్కటై పోరాటం చేశారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం అనేక మంది తమ ప్రాణాలను త్యాగం చేశారు. నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడిన రోజు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య వంటి వీరుల ధైర్యం, త్యాగం మనందరికీ స్ఫూర్తిదాయకం.

ప్రజా పాలన దినోత్సవం.

గట్టు (శివసూర్య)జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం లింగాపురం శకుంతల సునంద ఆధ్వర్యంలో ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి జెండా ఎగరవేశారు. నిజాం నిరంకుశ పాలనకు తెలంగాణ ప్రజలు ప్రాణ త్యాగం అర్పించిన రోజు అని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

మల్లంపల్లిలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

జాతీయ జెండాను ఆవిష్కరించిన సర్పంచ్ ల్యాద శ్యామరావు

మ: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్లంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ల్యాద శ్యామరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి జెండాకు గౌరవ వందనం సమర్పించారు. తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17కు ఉన్న ప్రత్యేక ప్రాధాన్యతను స్మరించుకోవడంతో పాటు ప్రజాస్వామ్య పాలన, ప్రజల భాగస్వామ్యం, జాతీయ సమైక్యత, రాజ్యాంగ విలువలను గుర్తుచేసుకోవడం ప్రజాపాలన దినోత్సవం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చూడడం, ప్రజల సమస్యలను పరిష్కరించడం, గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలపై ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామీణ ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడం, పారదర్శకమైన పాలన అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంకం సురేష్ ముదిరాజ్,గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దామెర గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ.

ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో గురువారం నాడు " " దామెర కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఠాగూర్ రామ్ సింగ్ ఆధ్వర్యంలో పలు కుటుంబాలకు చెక్కులు అందజేయడం జరిగింది. ఇందులో భాగంగా ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంతుర్తి రాజయ్య, మరియు ఎల్కతుర్తి సహకార బ్యాంక్ డైరెక్టర్ మద్దె రాములు ,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు కడారి రాజేందర్, మరియు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు కడారి సుధీర్ ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు పిల్లల నరేందర్ మరియు 12వ వార్డు మెంబర్ కడారి రమేష్, 13వ వార్డు మెంబర్ సాతూరి కుమార్ ,కడారి రాజు, రొడ్డబోయిన బిక్షపతి,ఉమ్మగొని ప్రభాకర్, మరియు గౌడ సంఘం అధ్యక్షులు పాటి శ్రీనివాస్ మరియు గౌడ సంఘం మాజీ అధ్యక్షులు మంద మూర్తి రవి, పండుగ వెంకటేశ్వర్లు, కడారి లక్ష్మణ్, ఈ

మల్లంపల్లిలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు

:భారతీయ జనతా పార్టీ మల్లంపల్లి మండల అధ్యక్షులు బైకాని మహేందర్ యాదవ్ గారి ఆధ్వర్యంలో మల్లంపల్లి మండల కేంద్రంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు బైకాని మహేందర్ యాదవ్ గారు మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17, 1948న సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి చొరవతో ఆపరేషన్ పోలో ద్వారా నిజాం రజాకార్ల నిరంకుశ పాలన నుండి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిందని అన్నారు. ఎంతో మంది అమరవీరుల త్యాగ ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని, వారి త్యాగాలను ఎప్పటికీ మరువకూడదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినంగా జరుపుతుండడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షులు దండిగా వెంకన్న బీజేవైఎం జనరల్ సెక్రెటరీ కత్తి హరీష్ మండల ఉపాధ్యక్షులు బండి బాబు గూడెల్లి కొమురెల్లి కొండ యుగంధర్ మండల జనరల్ సెక్రెటరీ ఎండిగ రాజు మండల కార్యదర్శి పోతరాజు సంపత్ సీనియర్ నాయకులు బొమ్మ రాతి సారన్నా పోతరాజు రమేష్ గొట్టేముక్కల నరేష్ శర్మ రాగుల శ్రీకాంత్ గుంటుక సురేష్ బొమ్మర వేన అజయ్ రాచర్ల వరుణ్ గొట్టేముక్కల శ్రీనివాస్

గిరిజన రిజర్వేషన్ 6 నుంచి 10 శాతానికి పెంచిన ఘనత కేసీఆర్‌దే

గిరిజనులకు రిజర్వేషన్లు పెంచి నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా మల్లంపల్లి మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ మాజీ సీఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ముఖ్యఅతిథిగా హాజరై బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు కలిసి పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ గిరిజనులకు ఉన్న రిజర్వేషన్‌ను 6 శాతం నుంచి 10 శాతానికి మాజీ సీఎం కేసీఆర్ అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నా, కేసీఆర్ హయాంలో తీసుకున్న నిర్ణయాలను ముందుకు తీసుకెళ్లడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజల పట్ల,ముఖ్యంగా రాష్ట్రంలోని గిరిజనుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గిరిజనులు నాయకులుగా ఎదగాలనే ఉద్దేశంతో కేసీఆర్ హయాంలో తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చారని తెలిపారు. కేసీఆర్ పాలనలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని అన్నారు. రోడ్లు,మంచినీటి సౌకర్యాలు లేని ప్రాంతాలను అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించారని,గిరిజన తండాల్లో నాయకత్వం కూడా అభివృద్ధి చెందిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అభివృద్ధి కార్యక్రమాల కంటే కేసీఆర్‌ను విమర్శించడంపైనే ఎక్కువ దృష్టి ఉందని లక్ష్మణ్ బాబు ఆరోపించారు. గిరిజనులు,పేద ప్రజల కోసం కేసీఆర్ చేసిన కృషి ప్రజలకు తెలుసన్నా ఆయన,ములుగు జిల్లాలో గిరిజనులకు ఇళ్ల నిర్మాణం విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఎంతమందికి ఇళ్లు ఇచ్చారు,ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి, ఇంకా ఎంతమందికి ఇళ్లు నిర్మించి ఇస్తారో మంత్రి సీతక్క వెల్లడించాలని కోరారు. ప్రస్తుతం చెబుతున్న లెక్కల ప్రకారం ఈ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణం 30 నుంచి 40 శాతం కూడా పూర్తికాలేదని,కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి ప్రజల్లో ఇప్పటికే గుర్తుండిపోయిందని,ప్రస్తుత ప్రభుత్వం మాటలు చెప్పడం తప్ప ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడం లేదని విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్, బీఆర్ఎస్‌పై అసత్యాలు మాట్లాడుతున్నారని లక్ష్మణ్ బాబు ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో రైతులు, గిరిజనులు,మహిళలు,ఉద్యోగులు,విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులకు సాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయని కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కూడా ప్రభుత్వం రాజకీయ ఉద్దేశాలతో వ్యవహరిస్తోందని,కాళేశ్వరం ప్రాజెక్టు కెసిఆర్ నిర్మించి రైతులకు సాగునీరు అందిస్తే, కాలేశ్వరం ప్రాజెక్టు విషయంలో రాజకీయం చేస్తూ ఆ నీటిని ఎత్తకుండా కేసీఆర్ పేరును చెడగొట్టాలని ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకోవడం,సభ నుంచి సస్పెండ్ చేయడం ద్వారా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని,ఇప్పటికైనా డైవర్షన్ రాజకీయాలను పక్కనపెట్టి ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. కేసీఆర్ గిరిజనులు, పేద ప్రజల కోసం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తుంచుకున్నారని,కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలకు నమ్మకం పోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు ఘన నివాళి

సోయంగంగులు స్మారక స్థూపం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో సభ

):తెలంగాణ వారోత్సవాల ముగింపు సందర్భంగా సీపీఎం దమ్మపేట మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని జమేదార్ బంజర్ గ్రామంలో వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, అమరజీవి కామ్రేడ్ సోయంగంగులు స్మారక స్థూపం వద్ద సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొక్కెరపాటి పుల్లయ్య ముఖ్య అతిథిగాహాజరయ్యారు. ముందుగాసోయంగంగులు స్మారక స్థూపం వద్ద పుల్లయ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పిట్టల అర్జున్ సోయంగంగులు స్థూపానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో పుల్లయ్య, పిట్టల అర్జున్, దొడ్డా లక్ష్మీనారాయణ తదితరులు మాట్లాడారు. 1946 జూలై 4న దొడ్డి కొమురయ్య మరణంతో ప్రారంభమైన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం 1951 అక్టోబర్ వరకు కొనసాగిందని వారు తెలిపారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన ఈ పోరాటంలో పేదలు, కష్టజీవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మకు సంబంధించిన భూమి, పంట విషయంలో జాగీర్దారులు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం ప్రజల్లో

గొల్లపూడిలో గణనాథుని మండపాలను సందర్శించిన దేవినేని ఉమా

విజయవాడ, సెప్టెంబర్ 17, వినాయక చవితి సందర్భంగా గొల్లపూడిలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు

సందర్శించారు. లైబ్రరీ వీధిలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంతో పాటు గాంధీ బొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను సందర్శించి విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రైతులు పాడిపంటలతో కళకళలాడాలని, ప్రజల జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని గణనాథుని ప్రార్థించారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులను దేవినేని ఉమా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యువత, భక్తులు పాల్గొన్నారు.

సేవా సంకల్ప అభియాన్‌లో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

ప్రధాని మోదీ 76వ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు..

: భారతదేశ ప్రధానమంత్రి గారి 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా నందిగామ పట్టణంలోని ప్రభుత్వ డివిఆర్ ఏరియా హాస్పిటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య

గారు కూటమి నేతలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేశ అభివృద్ధి, పేదల సంక్షేమం, యువతకు అవకాశాలు, మహిళా సాధికారతతో పాటు సేవాభావంతో ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించాలనే సంకల్పంతో ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో దేశం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే సౌమ్య గారు పేర్కొన్నారు. ప్రధాని మోదీ గారి స్ఫూర్తితో సేవే లక్ష్యంగా... ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆమె అన్నారు. సేవా సంకల్ప అభియాన్ ద్వారా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కన్వీనర్ పొరుగండి నరసింహారావు, భారతీయ జనతా పార్టీ నేతలు, కూటమి నేతలు, కార్యకర్తలు, ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొని ప్రధాని నరేంద్ర మోదీ గకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు.. .భక్తులకు అన్నదానం...

నందిగామ, సెప్టెంబర్ 17,:పట్టణంలోని జానకి రామయ్య కాలనీ దుర్గా నగర్‌లో కొలువుదీరిన

దుర్గమ్మ వారిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహానికి కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాలను ఆమె పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. తదుపరి భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నవితరణ కార్యక్రమంలో కూటమి నేతలు, మహిళా భక్తులతో కలిసి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహిస్తూ ఆధ్యాత్మికతను, సామాజిక ఐక్యతను చాటాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గణేష్ ఉత్సవాల నిర్వాహకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలి: ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)..

ఘనంగా సెంట్రల్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

విజయవాడ, సెప్టెంబర్ 17,విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావుతో కలిసి విజయవాడ ఎంపీ శ్రీ కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొన్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో పార్టీని మరింత బలోపేతం చేయడం, కూటమి అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని, ప్రతి కార్యకర్తను సమన్వయం చేసుకుంటూ ఎన్నికల కార్యాచరణను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి డివిజన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తూ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు

.ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా కృషి..

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఎంపీ చిన్ని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల వల్ల ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో ప్రతి కుటుంబానికి తెలియజేయడంతో పాటు, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా నాయకులు, కార్యకర్తలు సహకరించాలని తెలిపారు.

బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి..

ప్రతి డివిజన్‌లో బూత్ స్థాయి కమిటీలను మరింత క్రియాశీలం చేయాలని, ప్రతి బూత్ పరిధిలోని ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని ఎంపీ సూచించారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు.

సమన్వయంతో ముందుకు సాగాలి..

తెలుగుదేశం పార్టీతో పాటు కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య పూర్తి సమన్వయం ఉండాలని కేశినేని చిన్ని పేర్కొన్నారు. డివిజన్, బూత్ స్థాయిలో ముందస్తు ప్రణాళిక రూపొందించుకుని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి కార్యకర్తకు పార్టీ లక్ష్యాలను స్పష్టంగా తెలియజేసి, బాధ్యతలను అప్పగించి వాటిని సమర్థవంతంగా నిర్వహించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేస్తే పార్టీ నిర్దేశించిన లక్ష్యాలను సాధించగలమని ఎంపీ చిన్ని అన్నారు.

ప్రజలతో మమేకమై పార్టీకి మరింత బలం చేకూర్చాలి..

ప్రజలతో నిరంతరం మమేకమవుతూ వారి సమస్యలు, అవసరాలను తెలుసుకోవాలని ఎంపీ సూచించారు. పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పార్టీకి ప్రజల మద్దతును మరింతగా పెంచే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే డివిజన్, బూత్ స్థాయిలో పటిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని, కూటమి అభ్యర్థుల విజయమే ప్రధాన లక్ష్యంగా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమష్టి కృషి చేయాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు, డివిజన్ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సుజనా చౌదరి, మంత్రి సత్య కుమార్

విజయవాడ, సెప్టెంబర్ 17, :ప్రధాని నరేంద్ర మోదీ 76వ జన్మదినం మరియు 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విజయవాడ, కృష్ణమ్మ ఒడిలో దుర్గా ఘాట్ వద్ద ప్రత్యేక జల హారతుల కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని జన్మదినం

సందర్భంగా దీర్ఘాయుష్షు, ఆరోగ్యం ,విజయం కోసం ఇంటింటా దీపాలు వెలిగించాలని బీజేపీ పిలుపునివ్వడంతో మాజీ కేంద్ర మంత్రి విజయవాడ , పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తో కలిసి కృష్ణమ్మకు జల హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ 25 ఏళ్ల ప్రజా సేవకు అంకితమైన ప్రధాని నరేంద్ర మోదీ నవభారత నిర్మాణమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. ఆయనకు భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని , దేశ సేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆకాంక్షించారు. ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ ఇన్చార్జ్ నార్ని తాతాజీ , బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ వైస్ ప్రెసిడెంట్ బొమ్మదేవర రత్న కుమారి, బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే జగన్ మోహన్ రావు

నందిగామ, సెప్టెంబర్ 17,మండలం కేతవీరునిపాడు గ్రామంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథుడు 4 రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకొని... గురువారం నిమజ్జనం సందర్భంగా నిర్వహిస్తున్న ఊరేగింపులో మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

చేతి వృత్తుల సంక్షేమానికి ప్రధాని మోదీ కృషి విశ్వకర్మ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే సుజనా చౌదరి

విజయవాడ, సెప్టెంబర్ 17, :చేతివృత్తుల సంక్షేమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశేష కృషి చేస్తున్నారని మాజీ కేంద్ర మంత్రి విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ చౌదరి (సుజనా చౌదరి)అన్నారు. విశ్వకర్మ జయంతి వేడుకలు మరియు ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు గురువారం భవానిపురం, పున్నమి ఘాట్ , బోధ సిరి టూరిజం బోట్ లో ఘనంగా నిర్వహించారువిశ్వకర్మ జయంతి కమిటీ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకుడు, బీ సీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బ్రహ్మశ్రీ కర్రీ వేణుమాధవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి , ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, కూటమి నేతలతో కలిసి పాల్గొని కృష్ణమ్మకు జల సేవా హారతి ఇచ్చారు.. అనంతరం మోదీ జన్మదినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ విశ్వకర్మ జయంతి, ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు ఒకే రోజున జరుపుకోవడం శుభ పరిణామం అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలోని సాంప్రదాయ చేతివృత్తుల వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి పీఎం విశ్వకర్మ పథకం ద్వారా అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరికి నిస్వార్ధంగా సేవలు అందించడానికి సాయ శక్తుల ప్రయత్నిస్తున్నానన్నారూ. రాజకీయాలకతీతంగా సేవలు అందించడమే తన అభిమతమని సుజనా చౌదరి స్పష్టం చేశారు.

పెరియార్.. ఓ మహానుభావుడిగా పేరుపొందిన వెంకటప్ప రామసామి 1879 సెప్టెంబర్ 17న తమిళనాడులో

ఈరోడ్ లో ఒక సామాన్య కుటుంబంలో జన్మించారు. నేడు పెరియార్ ఇవి రామసామి 148వ జయంతి కార్యక్రమం వైజాగ్ బీచ్ రోడ్ లో ఆయన విగ్రహం వద్ద భారత నాస్తిక సమాజం మరియు పెరియార్ ఆశయ సాధన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీన్ వైజాగ్ అధ్యక్షుడు రాజా రామ్ మోహన్ రాయ్ మాట్లాడుతూ ఆయన చిన్నప్పటి నుంచే సమాజంలోని వైరుధ్యాలను, అన్యాయాలను ప్రశ్నించేవారు. మత గ్రంధాలు తర్కానికి విరుద్ధంగా ఉండటం మనిషిని కులం పేరుతో కించపరచడం వంటి అంశాలు పెరియార్ ను తీవ్రంగా ప్రభావితం చేశాయి. మతం అనేది ప్రజలను అణిచి వేయడానికి ఉపయోగించే ఒక సాధనమని గ్రహించి. అందరి ఆత్మగౌరవం కోసం పోరాడాలని రాజా రామ్మోహన్ రాయ్ కొనియాడారు. 1922 లో వెనుకబడిన వర్గాలకు విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని పెరియార్ చేసిన డిమాండ్ ను మహాత్మా గాంధీతో సహా కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో నిరాశ చెందిన పెరియార్ " నేను తమిళనాడులో కాంగ్రెస్ను శాశ్వతంగా అధికారంను కూలదోస్తాను అని సపధం చేశారు. చరిత్ర దీనికి సాక్ష్యం గా నిలిచింది - గడిచిన 58 సంవత్సరాలుగా తమిళనాడులో కాంగ్రెస్ అధికారంలోకి రాలేకపోయింది. భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి శ్రీరామమూర్తి మాట్లాడుతూ మహిళల స్వేచ్ఛ పట్ల పెరియార్ అభిప్రాయాలు విప్లవాత్మకమైనవని, మనం స్వేచ్ఛగా ఉండాలంటే స్త్రీలకు సమాన స్వేచ్ఛ ఇవ్వాలని అభిలాషించారని అన్నారు. అంటరానితనం నిర్మూలనకు, దళితులకు విద్యను అందించడం, చెరువులు, నూతుల నుండి దళితులు నీరు ఉపయోగించుకునే హక్కు కోసం పెరియార్ ఎంతో కృషి చేశారన్నారు. పీడిత కుల ప్రజలకు, సాంఘిక ఆర్థిక రాజకీయ అణిచివేతల నుంచి విముక్తికై పెరియార్ సాగించిన ఉద్యమం, చేపట్టిన సిద్ధాంతం విలక్షణమైనదని భారత నాస్తిక సమాజం జిల్లా అధ్యక్షుడు వై నూకరాజు అన్నారు. పెరియార్ ఆశయ సాధన సంఘం అధ్యక్షుడు పి పెంటారావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పెరియార్ విశేష కృషి చేశారని, స్త్రీ హక్కులకై ఉద్యమించిన నేత అని అన్నారు. ఈ కార్యక్రమంలో డా వై వల్లి, డా. సంజిత, రమణి, విజ్ఞానంద్, సాహిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి అజెండాతో ప్రజలకు బాధ్యతాయుత పాలన అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోంది

శాసనమండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు.

వనపర్తి జిల్లా ప్రతినిధి బాలరాజు 17 సెప్టెంబర్ 2026 గురువారం సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం వనపర్తి జిల్లాలోని ఐ.డి.ఓ.సి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేడుకలకు పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన చీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి పోలీస్ శాఖ ద్వారా ఇచ్చిన గౌరవ వందనాన్ని స్వీకరించారు.అనంతరం వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన లక్ష్యాలపై ప్రగతి నివేదికను చదివి వినిపించారు. వేదికపై జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీతా రెడ్డి, వనపర్తి శాసనసభ్యులు తుడి మేఘా రెడ్డి ఉపస్థితులయ్యారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఇట్టి వేడుకలకు హాజరైన గౌరవ పార్లమెంట్ సభ్యులకు, గౌరవ శాసన మండలి సభ్యులకు, గౌరవ శాసన సభ్యులకు, గౌరవ కలెక్టర్ గారికి, అదనపు కలెక్టర్లకు, జిల్లా న్యాయమూర్తులకు, జిల్లా ఎస్పీ, ఇతర ప్రజాప్రతినిధులకు, వివిద శాఖల జిల్లా అధికారులకు, విద్యార్థులకు, ప్రింట్ ఒ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు, పుర ప్రముఖులకు నా హృదయ పూర్వక ప్రజాపాలన దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు.చరిత్రలో 1948 సెప్టెంబర్ 17వ తేదీకి ఒక విశిష్టత ఉంది. 78 సంవత్సరాల క్రితం ఇదే రోజున మన తెలంగాణ ప్రాంతం భారతదేశంలో అంతర్భాగమయిందన్నారు. రాచరిక పరిపాలన నుండి ప్రజాస్వామ్య దశలోకి పరివర్తన చెందిందని, అందుకే ఈ రోజున తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నామన్నారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 555 సంస్థానాలు ఇండియన్ యునియన్ లో కలిశాయి, హైదరాబాద్ సంస్థానం మాత్రం స్వతంత్ర రాజ్యాంగ ఉండేందుకు నిర్ణయించుకుందన్నారు. ఈ ప్రాంత ప్రజల మేరకు భారత ప్రభుత్వం "ఆపరేషన్ పోలో" చర్య ద్వారా సెప్టెంబర్ 17, 1948న తెలంగాణ ప్రాంతాన్ని ఇండియన్ యునియన్ లో భాగం చేసిందన్నారు. ఈ నేపద్యంలో తెలంగాణలో ప్రజా పాలన దినోత్సవ వేడుకను ఘనంగా జరుపుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంది. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నదన్నారు.ఈ ప్రభుత్వం ప్రతి మహిళలను మహాలక్ష్మిగా చేయాలనే సంకల్పంతో మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. జిల్లాలో ఇప్పటివరకు 3 కోట్ల 84 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు. ఇందుకు గాను రూ.161.16 కోట్లను ప్రభుత్వం భరించిందన్నారు.2026-27 విద్యా సంవత్సరానికి 35,951 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 2 జతల యూనిఫామ్ లను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 53,902 యూనిఫామ్ లను కుట్టించి 41,150 మంది విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. నానాటికీ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల ప్రభావం పేద ప్రజల పై పడరాదన్న సంకల్పంతో మహాలక్ష్మి పథకం కింద కేవలం రూ.500 కే వంటగ్యాస్ సరఫరా చేసే కార్యక్రమాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. జిల్లాలో 85,383 వేల మందికి 5,12,439 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయడం జరిగింది. దీనికి గాను ప్రభుత్వం రూ. 15.71 కోట్ల వ్యయంతో సబ్సిడీ అందించిందన్నారు.జిల్లా మహిళా సమాఖ్య భవన నిర్మాణం రూ.5 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టి పనులు పూర్తయి ప్రారంభానికి సిద్దంగా వుందన్నారు. జిల్లాలోని 2025-26 సం. కి గాను 9,023 స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని ఋణాలు పథకం క్రింద 7 కోట్ల 72 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా వనపర్తి జిల్లా లోని 5 మునిసిపాలిటీల లో 2023-24 2024-25 సంవత్సరాలకు సంబంధించి 956 సంఘాలకు రూ. 3 కోట్ల 16 లక్షలు వడ్డీ లేని ఋణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు.

రాజీవ్ ఆరోగ్యశ్రీ:

పేదలకు మెరుగైన వైద్యసేవ, వైద్య సదుపాయాల కల్పన అందించే ఉద్దేశంతో "రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని" రూ.10 లక్షల వరకు ఉచితవైద్యం పొందేలా పేదలకు అందుబాటులోకి తేవడం జరిగిందని, జనవరి 1, 2026 నుండి ఈ పథకం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 6,816 మందికి 22 కోట్ల 14 లక్షల రూపాయలు ఖర్చు చేసి ఉచిత వైద్య చికిత్సలు అందించడం జరిగిందన్నారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యంరైతు భీమా పథకం ద్వారా 2025-26 సంవత్సరంలో జిల్లాలో 702 మంది రైతులకు రూ.35.10 కోట్లను వారి కుటుంబాలకు అందించామన్నారు. రైతు భరోసా పథకం కింద 2026 వానాకాలం సీజన్‌లో 1,82,768 మంది రైతులకు ఎకరానికి రూ.6 వేల చొప్పున రూ.212.32 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.కర్నేతండా ఎత్తిపోతల పథకం రూ. 76 కోట్ల 19 లక్షల అంచనా వ్యయంతో చేపట్టి పనులు పూర్తి చేసి ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా గిరిజన ప్రాంతాలలో చెరువులు నింపి 4 వేల 235 ఎకరాలకు సాగు నీరు అందించడం జరుగుతుంది.ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది 38% లోటు వర్షపాతం నమోదైన నేపథ్యంలో రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. మినుములు, కంది, జొన్న, ఆముదం, కూరగాయలు తదితర ఆరుతడి పంటలను సాగు చేసేలా రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులకు సమావేశాల ద్వారా, కరపత్రాల ద్వారా, పత్రికా ప్రకటనల ద్వారా, కృత్రిమ మేధస్సు (ఏఐ) ద్వారా విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించడం జరిగిందన్నారు.రాష్ట్రంలోనే అత్యధికంగా 90 % మినుములు మన జిల్లాలో రాయితీ క్రింద 1,127 క్వింటాళ్ళు పంపిణి చేయడం జరిగిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నానన్నారు. అదేవిధంగా వేరుశనగ విత్తనాలు పూర్తి 100 % సబ్సిడితో 3 వేల 750 ఎకరాలు సాగుచేయడానికి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. పేదలకు కడుపు నిండా అన్నం పెట్టడానికి ప్రతి రేషన్ కార్డ్ దారునికి సన్న బియ్యం అందించే ఉద్దేశంతో వనపర్తి జిల్లాలో 1,83,568 రేషన్ కార్డుల ద్వారా సన్న రకం బియ్యం ఆగస్ట్, సెప్టెంబర్ మరియు అక్టోబర్ మాసాలకు ఒకేసారి లబ్దిదారులకు పంపిణి చేయడం జరుగుచున్నదన్నారు. జిల్లా లో 26,465 కొత్త రేషన్ కార్డుల తో పాటు 1,04,000 మంది అదనపు కుటుంబ సభ్యులను కూడా ఇదివరకే ఉన్న కార్డులలో చేర్చడం జరిగిందన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద వనపర్తి జిల్లాలో 5,874 గృహాలు మంజూరు కాగా, ఇప్పటి వరకు 92 శాతం గృహాల నిర్మాణం పూర్తయిందన్నారు. ఈ పథకం కింద జిల్లాలో రూ.170.84 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జిల్లా తెలంగాణ లో 13 వ స్థానంలో వుందన్నారు. 2వ విడత కింద ఇందిరమ్మ ఇండ్లు నియోజకవర్గానికి 2 వేల ఇండ్లు మంజూరు కాగా మొదటిగా గుడిసెలు లేని తెలంగాణ రాష్ట్రముగ తీర్చిదిద్దుటలో భాగంగా జిల్లాలో 689 మంది లబ్దిదారులను గుర్తించి వారిలో అర్హులైన 560 మంది లబ్దిదారులకు ఇండ్లు మంజూరు చేయగా వాటిలో 120 ఇండ్లు బేస్ మెంట్ వరకు పూర్తి అయి 17% ముందంజలో ఉన్నదని తెలియజేయడానికి సంతోషిస్తున్నానన్నారు. అదేవిధంగా ప్రభుత్వము ప్రతి నియోజకవర్గమునకు పైకప్పు భర్తీ పథకం కింద 500 ఇండ్లు కేటాయించగా నెలాఖరులోగా 235 మంది అర్హులైన వారిని గుర్తించి సంబంధిత లబ్దిదారులకు రూ. 2 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. గృహజ్యోతి పథకం క్రింద 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తోంది. వనపర్తి జిల్లాలో ఇప్పటి వరకు 85,423 కుటుంబాలకు 21,60,000 జీరో బిల్లులు జారీచేయడం జరిగింది. ఇప్పటివరకు ప్రభుత్వం రూ.62 కోట్ల 60 లక్షల సబ్సిడి అందచేయడం జరిగిందన్నారు. "చేయూత" పథకం ద్వారా వికలాంగులు, వృద్ధులు, వితంతువులు మరియు ఇతర అర్హులైన పేదలకు ప్రతి నెలా పెన్షన్ ఇవ్వడం జరుగుతుంది. వనపర్తి జిల్లాలో 70,342 మందికి నెలకు రూ.16 కోట్ల 33 లక్షలు పెన్షన్ కోసం ఇవ్వడం జరుగుతుందన్నారు. వన మహోత్సవం, పర్యావరణ పరిరక్షణవన మహోత్సవంలో భాగంగా జిల్లాలో 17.09 లక్షల మొక్కలు నాటే లక్ష్యానికి గాను ఇప్పటి వరకు 8.65 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. మొక్కల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు.

ప్రజావాణి :

పారదర్శకత, జవాబుదారితనంతో ప్రజలకు సేవలు అందించడంలో భాగంగా ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా స్థాయి నుండి రెవిన్యూ డివిజన్ స్థాయికి మరియు మండల స్థాయికి విస్తరించడం జరిగిందన్నారు. దీని ద్వారా ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రాసెస్ చేసి ఫిర్యాదులను ప్రజావాణి పోర్టల్ ద్వారా పరిష్కరించడం జరుగుతుందన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యంవనపర్తి జిల్లాలో రూ.200 కోట్ల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరై పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వసతి గృహాలు, పాఠశాల బ్లాకుల నిర్మాణానికి రూ.13.50 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు.వనపర్తి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల భవనాల నిర్మాణానికి రూ.47.50 కోట్లు మంజూరై పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన అభ్యాస వాతావరణం కల్పించడం, బోధన- అభ్యసన ప్రక్రియను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో 85 సి ఎం కిట్స్ అదే విధంగా కే జి బి వి లలో 69 సి ఎం కిట్సత విద్యా సామగ్రి అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు పెద్దమందడి మండలంలోని, వెల్టూర్ జడ్పి హెచ్ ఎస్ పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్ గా ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. వైద్య రంగంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం వల్ల ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెరిగిందన్నారు. వనపర్తి జిల్లా ఆసుపత్రి నిర్మాణానికి రూ.203.95 కోట్లు, పెబ్బేరులో రూ.11.20 కోట్లతో, ఆత్మకూరులో రూ.22 కోట్ల అంచనా వ్యయంతో 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ జిల్లా జనరల్ ఆసుపత్రికి మంజూరు అయి ప్రారంభానికి సిద్ధంగా వున్నదన్నారు. మిషన్ మధుమేహ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 19,643 మందిని మధుమేహ బాధితులుగా గుర్తించి "మిషన్ మధుమేహ దృష్టి" కార్యక్రమం ద్వారా వారందరికీ డయాబెటిక్ రెటినోపతి పరీక్షలు నిర్వహించగా, వారిలో 1,269 మందికి డయాబెటిక్ రెటినోపతి ఉన్నట్లుగా గుర్తించడం జరిగిందన్నారు. వారికి సంబంధిత ఆసుపత్రుల ద్వారా నాణ్యమైన పరీక్షలు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.భూ సమస్యల పరిష్కారానికి భూ భారతిరైతుల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు భూ భారతి చట్టాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 12,851 దరఖాస్తులు స్వీకరించి, వాటిలో 11,403 దరఖాస్తులను పరిష్కరించినట్లు వెల్లడించారు.శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, జిల్లాలో 2,221 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళల రక్షణ కోసం షీ టీమ్స్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.మహిళల రక్షణలో భాగంగా ఈవ్ టీజింగును నిరోధిస్తూ షీ,టీమ్, మరియు అతుల ద్వార మహిళల రక్షణకు భరోస కల్పించడానికి అవగాహన సదస్సులు నిర్వహించి మహిళలు నిర్భయంగా జీవించే వాతావరణం కల్పించిందన్నారు.బాల్య వివాహాల, రోడ్డు ప్రమాదాల నివారణకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. డయల్-100 ద్వారా వేగవంతమైన పోలీసింగ్ ద్వారా ఇప్పటివరకు ప్రజల్లో భద్రతా భావన పెంచడం జరిగిందన్నారు. ఇప్పటి నుండి డయల్-100 స్థానంలో డయల్--112 ద్వారా అత్యవసర సేవలైన, పోలీస్, ఫైర్ ఒ అంబులెన్స్, సేవలను రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకురావడం జరిగిందన్నారు. వనపర్తి జిల్లా అభివృద్ధిలో భాగస్వాములైన ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు యంత్రాంగం, న్యాయ వ్యవస్థ, పాత్రికేయులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు డా. పట్నం మహేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాలబాలికలకు ఆశీస్సులు అందిస్తూ, ప్రజలందరికీ మరోసారి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే సత్యం

మృతుల కుటుంబాలను పరామర్శించి తలా రూ.5 వేల ఆర్థిక సహాయం

రామడుగు, సెప్టెంబర్ 17:గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను గౌరవ చొప్పదండి శాసనసభ్యులు డా. మేడిపల్లి సత్యం గారు పరామర్శించారు.బూరుగుపల్లి గ్రామానికి చెందిన బైరి కార్తీక్ అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సత్యం గారు పరామర్శించి, కుటుంబానికి అండగా నిలిచారు. అలాగే అదే గ్రామానికి చెందిన రాగం అనిల్ గారి సతీమణి మరియు తండ్రి మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు తలా రూ.5,000/- చొప్పున ఆర్థిక సహాయం అందించారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అండగా ఉంటారని ఎమ్మెల్యే సత్యం గారు భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌ను సందర్శించిన ప్రకృతి ప్రేమికుడు గుడివాడ నాగరత్నం నాయుడు

పలమనేరు సెప్టెంబర్ 17(:పలమనేరు పాతపేట ఉన్న ఆదర్శ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌ను ప్రకృతి ప్రేమికుడు, ఆదర్శ రైతు గుడివాడ నాగరత్నం నాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులతో సమావేశమై ప్రకృతి పరిరక్షణ, వాతావరణ మార్పులు, ప్రకృతి వ్యవసాయం తదితర అంశాలపై అవగాహనకల్పించారు.ప్రకృతిలో చోటుచేసుకుంటున్న మార్పులు, వాటి ప్రభావాలు, పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన ఆవశ్యకతపై విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావం వల్ల వాతావరణ పరిస్థితుల్లో చోటుచేసుకునే మార్పులు, ఉష్ణోగ్రతలు, వర్షపాతం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎల్‌నినో వంటి వాతావరణ పరిణామాల ప్రభావాన్ని తగ్గించేందుకు చెట్ల పెంపకం, నీటి సంరక్షణ, ప్రకృతి పరిరక్షణ, పర్యావరణహిత జీవన విధానాలను ప్రతి ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ నాయుడు, అకడమిక్ డైరెక్టర్ నీరాజ్ ప్రసాద్ నాయుడు, ఉపాధ్యాయుల బృందం విద్యార్థినీ విద్యార్థులు, గుడివాడ నాగరత్నం నాయుడుకు ఘన స్వాగతం పలికారు.అనంతరం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ... చిత్తూరు జిల్లా బాలకృష్ణాపురం గ్రామానికి చెందిన గుడివాడ నాగరత్నం నాయుడు, తన ఉద్యోగ జీవితాన్ని విడిచిపెట్టి తన భార్య సత్యవతితో కలిసి వ్యవసాయం వైపు అడుగులు వేశారని తెలిపారు. హైదరాబాద్ సమీపంలోని తారామతిపేటలో బంజరు,రాతి భూమిని పచ్చని వ్యవసాయ క్షేత్రంగా తీర్చిదిద్ది, ప్రకృతితో సహజీవనం చేస్తూ వ్యవసాయంలో అనేక ప్రయోగాలు చేశారని పేర్కొన్నారు. సేంద్రియ వ్యవసాయం, మిశ్రమ పంటల సాగు, నీటి పొదుపు పద్ధతులు, సార్ వరి సాగు, పండ్ల తోటలు, కూరగాయలు, పూల సాగుతో పాటు పశుపోషణను సమగ్రంగా చేపట్టి ఆదర్శంగా నిలిచారని తెలిపారు.తన వ్యవసాయ క్షేత్రాన్ని కేవలం సాగు కోసం మాత్రమే కాకుండా విద్యార్థులు, రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించే వేదికగా కూడా ఉపయోగిస్తున్నారని అన్నారు.ప్రకృతి వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన వ్యవసాయ విధానాలపై ఆయన చేస్తున్న కృషికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు సంస్థల నుంచి గుర్తింపు, అవార్డులు లభించాయని ప్రిన్సిపాల్ తెలిపారు.బంజరు భూమిని పచ్చని వ్యవసాయ క్షేత్రంగా మార్చి, ప్రకృతితో సమతుల్యతను పాటిస్తూ వ్యవసాయానికి కొత్త దిశను చూపుతున్న గుడివాడ నాగరత్నం నాయుడు విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రకృతి వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం తదితర అంశాలపై పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రకృతిపై అవగాహన కల్పించే ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగకరమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

ముచ్చటైన మరో మూడు పక్షులు

పసుపు చెంప పిట్ట , పసుపు గొంతు బుల్‌బుల్ పిట్ట , లీసెర్ విజిలింగ్ డక్ బేబీ

శేషాచల అడవుల్లో గుర్తించిన గరుడ అట్లాస్ బృందం

తిరుపతి ప్రాంతంలో ఇప్పటివరకు 274 పక్షిజాతుల గుర్తింపు

తిరుపతి సిటీ: తిరుపతి శేషాచల అడవుల్లో తిరుపతి నేచర్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ సహకారంతో మరో మూడు అరుదైన పక్షి జాతుల్ని గుర్తించినట్టు గరుడ అట్లాస్ బృందం ఆదివారం వెల్లడించింది. తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐజర్) బృందంతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 50 మంది పరిశోధకులు పక్షిజాతుల గణన, వాటి వైవిధ్యం, మనుగడ, జీవన విధానంపై ప్రత్యేక సర్వే చేపట్టారు. 2022లో ఏర్పడిన తిరుపతి బర్డ్ అట్లాస్ ఇటీవల గరుడ అట్లాస్‌గా పేరు మార్చుకుని తిరుపతి పరిసర ప్రాంతాల్లోనూ, శేషాచల అడవుల్లోనూ సంచరించే పక్షిజాతుల డేటాను సేకరించేందుకు శ్రీకారం చుట్టింది. విడతల వారీగా అటవీ ప్రాంతాలలో సర్వే చేపట్టి అరుదైన పక్షి జాతులను గరుడ అట్లాస్ బృందాలు కెమెరాల్లో బంధిస్తున్నాయి. తిరుపతి ప్రాంతంలో తొలిసారిగా పసుపు చెంప పిట్ట (ఇండియన్ ఎల్లో టిట్) అనే అరుదైన పక్షిని కనిపెట్టామని గరుడ అట్లాస్ ప్రతినిధులు చెప్పారు. వీటితో పాటు పసుపు గొంతు బుల్‌బుల్ పిట్ట (ఎల్లో థ్రోటెడ్ బుల్‌బుల్), లీసెర్ విజిలింగ్ డక్ బేబీ వంటి అరుదైన పక్షిజాతులు తిరుపతి ప్రాంతంలో ఉండటం విశేషమన్నారు. కొండలపై నివసించే రాప్టర్ ఐన్ షాహీన్ ఫాల్కన్ పక్షులు సైతం తిరుమల ఘాట్ రోడ్డులో ఆవాసాలు ఏర్పాటు చేసుకోవడం హర్షణీయమని తెలిపారు.

ఇప్పటివరకు 274 పక్షిజాతుల గుర్తింపు

మానవ సమాజంతో పక్షిజాతుల అనుబంధాన్ని బలోపేతం చేసేందుకు ఈ సర్వే చేపట్టినట్లు ఐజర్ బృందంలో పరిశోధకుడైన హరీష్ పేర్కొన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. తమ బృందాలు ఇప్పటివరకు తిరుపతి పరిసర ప్రాంతాల్లో 55 వేల పక్షుల గమనాలను పరిశీలించాయని చెప్పారు. ఇందులో 274 పక్షిజాతులు ప్రకృతిలో మమేకమై ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 5 ఎడిషన్లలో పక్షి జాతుల డేటాను సేకరించామని, వాటిని పూర్తి స్థాయిలో మ్యాపింగ్ చేశామని తెలిపారు. ఆయన వెంట పుష్యామిత్ర, టీఎన్ఎస్ ప్రతినిధి పి రామచంద్రారెడ్డి తదితరులున్నారు.

దమ్ముంది.. దన్ను కావాలి

ఇప్పటికైతే మనది 10వ స్థానం

ఏఐ మేధోనిధి.. ఇండియా!

మెరికలున్నా సదుపాయాల్లేవు

నైపుణ్యం ఒక్కటే సరిపోదు

సూపర్ కంప్యూటర్‌లు... భారీ పెట్టుబడులు అవసరం

ఏఐ సదస్సు చూపిన 'ఇంపాక్ట్'

ఢిల్లీలో ఐదు రోజుల ఐఏ ఇంపాక్ట్ సదస్సు ఇటీవలే ముగిసింది. ఇండియా ఈ సదస్సును మొదటిసారి నిర్వహించింది. ప్రపంచ దేశాల నాయకులు ఇందులో పాల్గొన్నారు. కొత్త ఆవిష్కరణలపై అంతా దృష్టి పెట్టారు. ఇండియాకైతే ఇది ఒక కీలకమైన సందర్భం. మన ఏఐ వ్యవస్థలో ఉన్న బలాలు, పూరించుకోవలసిన లోట్లను ఈ సదస్సు స్పష్టం చేసింది.

నిపుణుల సంఖ్యలో రెండో స్థానం

ఏఐ రంగంలో మెరికలు ఉన్న దేశంగా ఇండియా పేరు పొందింది. కానీ మౌలిక సదుపాయాల విషయంలో వెనుకబడి ఉంది. 2024 'టార్టాయిస్ గ్లోబల్ ఏఐ ఇండెక్స్' ప్రకారం, ఏఐ సామర్థ్యంలో ఇండియా ప్రపంచంలో 10వ స్థానంలో ఉంది. ఏఐ నిపుణుల సంఖ్యలో మాత్రం 2వ స్థానంలో నిలిచింది.

సౌకర్యాలలో 68వ స్థానం

ఏఐ ఆపరేషన్స్‌లో ఇండియా 3వ స్థానంతో మంచి ప్రతిభ కనబరిచింది. అయితే కంప్యూటింగ్ పవర్, ఇతర సౌకర్యాల విషయంలో 68వ స్థానంలో ఉంది. ఈ కారణంగా అమెరికా, చైనాతో పోటీ పడటం భారత్‌కు కష్టం కావచ్చన్న అభిప్రాయం ఏఐ పరిశ్రమలో వ్యక్తం అవుతోంది.

ఉన్నది కొన్నే సూపర్ కంప్యూటర్‌లు

ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యంత శక్తివంతమైన 500 సూపర్ కంప్యూటర్లలో ఇండియా వాటా కేవలం 1 శాతం మాత్రమే. అంటే, ఏఐకి కావలసిన కంప్యూటింగ్ సామర్థ్యం మన దగ్గర చాలా తక్కువగా ఉంది. అమెరికా ఈ విషయంలో చాలా ముందుంది. ప్రపంచంలోని మొత్తం సూపర్ కంప్యూటర్లలో 35 శాతం సిస్టమ్‌లు, దాదాపు 48 శాతం కంప్యూటింగ్ సామర్థ్యం అమెరికా దగ్గరే ఉంది.

ట్రైనింగ్ డేటాలో 3 శాతం వాటా

ఏఐ ట్రైనింగ్ డేటా రంగంలో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పెట్టుబడులలో భారతదేశం వాటా కేవలం 3 శాతం మాత్రమే. అంటే, మన దేశానికి చాలా తక్కువ పెట్టుబడులు అందుతున్నాయి. ఈ విషయంలో అమెరికా 56 శాతంతో అందరికంటే ముందుంది. ఆ తర్వాత చైనా 17 శాతంతో, ఐరోపా సమాఖ్య దేశాలు 15 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

ప్రపంచాన్ని శాసించగలమా?

మన దగ్గర అద్భుతమైన తెలివితేటలు కలిగిన నిపుణులు ఉన్నారు. కానీ, ఆ తెలివితేటలకు తగ్గట్టుగా శక్తివంతమైన కంప్యూటర్లు, భారీ పెట్టుబడులు తోడవాల్సి ఉంది. అమెరికా, చైనా వంటి దేశాలతో పోటీ పడాలంటే, కేవలం సాఫ్ట్‌వేర్ నైపుణ్యం మాత్రమే సరిపోదు; సొంతంగా డేటా సెంటర్లు, సూపర్ కంప్యూటర్లను పెంచుకోవాలి. అప్పుడే ఇండియా ఏఐ ప్రపంచాన్ని శాసించ గలుగుతుంది.

హెచ్.పి.సి. సిస్టమ్ : హై పెర్ఫార్మింగ్ కంప్యూటింగ్ (యంత్ర సామర్థ్యం)

హెచ్.పి.సి. కెపాసిటీ : హై పెర్ఫార్మింగ్ కెపాసిటీ (శక్తి సామర్థ్యం)

హెచ్.ఐ.సి.: హై ఇన్‌కం కంట్రీస్; యు.ఎం.ఐ.సి.: అప్పర్ మిడిల్ ఇన్‌కం కంట్రీస్

ఎల్.ఎం.ఐ. సి. : లోయర్--మిడిల్ ఇన్‌కం కంట్రీస్

నేటి పాత స్మార్ట్‌ఫోన్లే... రేపటి ఫైటర్ జెట్లు!

ఫోన్ల నుంచి అరుదైన మూలకాల వెలికితీతకు యత్నాలు

కొత్త ఫోన్ కొనగానే పాతదానిని చెత్త ఫోన్ అంటూ చెత్తబుట్టలో పడేయడం చాలామందికి అలవాటు. కానీ ఆ పాత ఫోన్‌లో 'రేర్ ఎర్త్ ఎలిమెంట్స్'గా పిలిచే అత్యంత విలువైన భూ అయస్కాంత మూలకాలు అత్యంత సూక్ష్మపరిమాణంలో ఉంటాయి. వాటిని విదేశాల నుంచి వేలాది కోట్లు వెచ్చించి దిగుమతి చేసుకునే బదులు ఈ పాత ఫోన్ల నుంచే సంగ్రహిస్తే? కేంద్రం ఇప్పుడు సరిగ్గా ఇలాంటి ఆలోచనే చేస్తోంది. తద్వారా లక్షల కోట్ల విదేశీమారక ద్రవ్యం ఆదా అవుతుందని భావిస్తోంది! "టన్ను ముడిఖనిజం నుంచి కేవలం ఒకట్రెండు కిలోల కోబాల్ట్ మాత్రమే తీయగలం. అదే టన్ను పాత బ్యాటరీల నుంచి ఏకంగా 50 నుంచి 80 కేజీల దాకా సమీకరించవచ్చు. పైగా ముడిఖనిజ కోబాల్ట్ కంటే ఇది 40 ఎక్కువ గాఢత కలిగి ఉంటుంది" అని గ్రేటర్ నోయిడా కేంద్రంగా పనిచేసే లిథియం--అయాన్ బ్యాటరీ తయారీ సంస్థ 'లోహం' రీసైక్లింగ్ హెడ్ సయ్యద్ గజన్‌ఫర్ అబ్బాస్ సాఫ్వీ చెప్పారు. "ఇప్పటికే ఎంతో శ్రమించి తయారుచేసిన స్మార్ట్‌ఫోన్ వంటి ఈ--వేస్ట్‌లో ఎంతో విలువైన ఖనిజాలుంటాయి. వాటిపై భారత్ ఇప్పటిదాకా సరైన దృష్టి సారించలేదు" అని ఈ--వేస్ట్ మేనేజ్‌మెంట్, లిథియం--అయాన్ బ్యాటరీ కంపెనీ అట్టెరో సహ వ్యవస్థాపకుడు నితిన్ గుప్తా చెప్పారు. యుద్ధ విమానాలు అత్యంత తేలిగ్గా, అత్యంత దృఢంగా ఉండటానికి నియోడైమియం వంటి ఈ మూలకాలే కారణం. వాటిలో ఇంధనం ప్రవాహాలు, రెక్కల కదలికలు, కాక్‌పిట్‌కు కరెంటు సరఫరా చేసే జనరేటర్లను పర్యవేక్షించే సెన్సార్లకు అవే శక్తినందిస్తాయి. "భారత్ ప్రస్తుతం ఈ--వేస్ట్‌ను విదేశాలకు అనవసరంగా ఎగుమతి చేస్తోంది. అలాగాక భారత్‌లోనే భారీగా శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలి. తద్వారా ఈ--వేస్ట్‌లోని భూ అయస్కాంత మూలకాలను సంగ్రహించి యుద్ధ విమానాల తయారీకి సదీ?వినియోగం చేసుకోవచ్చు. అత్యంత అరుదైన ఖనిజాల కోసం చైనా వంటి ప్రత్యర్థి దేశాలపై ఆధారపడే దురవస్థ తొలగుతుంది" అని ముంబై కేంద్రంగా పనిచేసే శుద్ధ సాంకేతిక సంస్థ 'లీకో' సీఈవో గౌరవ్ దోల్వానీ అన్నారు.

మనోవేదనను 'మెషీన్' చెప్పేస్తుంది

వాయిస్ శాంపిల్స్‌ను చిటికెలో విశ్లేషించి ముందే అప్రమత్తం చేస్తున్న మెషీన్ లెర్నింగ్ మోడల్స్

తొలిదశలోనే మనోవ్యాధి లక్షణాలను పసిగట్టడంలో దోహదపడుతున్న సాంకేతికత

తాజా ప్రయోగాల్లో 70 శాతం నుంచి 96 శాతం వరకు కచ్చితత్వంతో ఫలితాలు

ఢిల్లీ ఎయిమ్స్ చేపట్టినపరిశోధనలో 78 శాతం కచ్చితత్వం నమోదు

ఒకరు చెబుతున్నది నిజమో లేక అబద్ధమో లై డిటెక్టర్ టెస్ట్ చిటికెలో చెప్పేస్తుంది. నాడీ స్పందనలు, బీపీలో హెచ్చుతగ్గులు, శ్వాస తీసుకోవడంలో మార్పులను విశ్లేషించి ఆయా అంశాలను నిర్ధారిస్తుంది. అదే తరహాలో డిప్రెషన్‌ను కేవలం ఒక్క వాయిస్ శాంపిల్‌తో మెషీన్ లెర్నింగ్ చాలా వరకు కచ్చితత్వంతో తొలిదశలోనే గుర్తిస్తోంది! ఈ మేరకు సాగిన అధ్యయనాల్లో ఈ విషయం వెల్లడైంది. సంప్రదాయ చికిత్సా పద్ధతుల్లో డిప్రెషన్‌ను నిర్ధారించేందుకు వైద్యులు రోగులను కొన్ని ప్రశ్నలడిగి వారి భావోద్వేగ పరిస్థితులను అంచనా వేస్తుంటారు. అయితే ఈ పద్ధతిలో బాధితులు వారంతట వారుగా ముందుకొస్తే తప్ప వైద్య సాయం చేసేందుకు వీలు ఉండదు. దీనివల్ల చాలా సందర్భాల్లో బాధితులకు వైద్య సహాయం ఆలస్యం అవుతోంది. కానీ శాస్త్రవేత్తలు ఈ సమస్యను అధిగమించేందుకు ఏఐ సాంకేతికతను తెరపైకి తెచ్చారు. కుంగుబాటుకు గురైన వారి స్వరంలో హెచ్చుతగ్గులను మెషీన్ లెర్నింగ్ అల్గోరిథంల సాయంతో విశ్లేషిస్తున్నారు. కేవలం వాట్సాప్ ఆడియో ఫైల్స్‌ను విశ్లేషించడం ద్వారా డిప్రెషన్ బాధితుల లక్షణాలను 70 శాతం నుంచి 96 శాతం వరకు కచ్చితత్వంతో మెషీన్ లెర్నింగ్ టూల్స్ గుర్తిస్తున్నట్లు ప్రయోగాత్మకంగా నిరూపిస్తున్నారు. 25--30 సెకన్ల ఆడియో ఫైల్‌లోని స్వరంలో హెచ్చుతగ్గులు, వాల్యూమ్, స్పీచ్ రేట్ వంటి శబ్ద లక్షణాలను విశ్లేషించడం ద్వారా ఆయా వ్యక్తుల మనోవ్యథను మెషీన్ లెర్నింగ్ మోడల్స్ గుర్తిస్తున్నట్లు చెబుతున్నారు.

ఎయిమ్స్‌పరిశోధన ఇలా...

డిప్రెషన్‌ను ముందుగానే గుర్తించడానికి స్పీచ్ అనాలిసిస్ ఒక ఆచరణాత్మక సాధనంగా ఉంటుందా అనే అంశాన్ని పరిశీలించేందుకు ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) పరిశోధన నిర్వహించింది. ఇందులో భాగంగా పరిశోధకులు 423 మంది వాలంటీర్ల నుంచి (ప్రధానంగా 18--25 సంవత్సరాల ఏళ్ల వారు) సంతోషం, బాధలో ఉన్నప్పుడు మాట్లాడిన స్వర నమూనాలను సేకరించి విశ్లేషించారు. ఈ ప్రయోగంలో పాల్గొన్న వాలంటీర్లు వారి క్లినికల్ మానసిక ఆరోగ్య స్థితిని నిర్ధారించుకోవడానికి ప్రామాణిక మానసిక పరీక్షలను కూడా చేయించుకున్నారు. ఈ అధ్యయనంలో వారి స్వరం, స్వర స్థాయి, స్వర శక్తితో సహా వాక్పటిమ, ఉచ్చారణ, ఇతర గుర్తులపై పరిశోధకులు దృష్టి సారించారు. దీనిప్రకారం నిరాశతో మాట్లాడిన సందర్భాల్లో వాక్పటిమ, భావోద్వేగ స్వరం, తక్కువ స్వర స్థాయిలను గమనించారు. అలాగే వాయిస్ విశ్లేషణను క్లినికల్ డేటాతో పోల్చినప్పుడు నమూనా నాణ్యతను బట్టి మెషీన్ లెర్నింగ్ మోడల్స్‌దాదాపు 60 శాతం నుంచి 78 శాతం కచ్చితత్వంతో నిస్పృహ లక్షణాలను సరిగ్గా అంచనా వేశాయని గుర్తించారు.

వాయిస్ నోట్స్ ద్వారా...

పీఎల్‌వోఎస్ మెంటల్ హెల్త్‌లో ప్రచురితమైన మరో నివేదిక ప్రకారం బ్రెజిల్‌కు చెందిన మానసిక వైద్య పరిశోధకుడు విక్టర్ ఒటాని నేతృత్వంలోని పరిశోధకులు... డిప్రెసివ్ డిజార్డర్ లక్షణాలు ఉన్న, అవి లేని వ్యక్తులను వేరు చేయడంలో మెషీన్ లెర్నింగ్ మోడళ్లు సహాయపడతాయా అని పరీక్షించారు. ఈ అధ్యయనంలో పాల్గొన్న వారి నుంచి స్వల్ప వ్యవధిగల వాట్సాప్ వాయిస్ సందేశాలను రికార్డ్ చేశారు. ఆ ఆడియో క్లిప్‌ల నుంచి సేకరించిన శబ్ద లక్షణాలపై ఏడు వేర్వేరు మెషీన్ లెర్నింగ్ నమూనాలు, ప్రామాణిక క్లినికల్ ఇంటర్వ్యూలను ఉపయోగించి కుంగుబాటును నిర్ధారించారు. దీని ప్రకారం ఏఐ నమూనాలు మహిళల్లో 91.67 శాతం వరకు, పురుషులలో 80 శాతం వరకు కచ్చితత్వంతో కుంగుబాటును గుర్తించాయి.

ఇతర ప్రపంచ అధ్యయనాలు ఏమి చెబుతున్నాయి...

ది యానల్స్ ఆఫ్ ఫ్యామిలీ మెడిసిన్‌లో ప్రచురితమైన మరో అధ్యయనం మాటలు, స్పందనల్లోని నిరాశను గుర్తించడానికి ఏఐ--ఆధారిత వాయిస్ బయోమార్కర్ సాధనాన్ని మూల్యాంకనం చేసింది. మెషీన్ లెర్నింగ్ సాధనం 70 శాతం కంటే ఎక్కువ కేసుల్లో ఆడియో ఫైల్‌ను సమర్పించిన 25 సెకన్లలోనే మోస్తరు నుంచి తీవ్ర నిరాశలో ఉన్న బాధితుల స్వరాలను గుర్తించింది. యూఎస్, కెనడాలోని దాదాపు 15,000 మంది వయోజనుల నుంచి సేకరించిన వాయిస్ రికార్డింగ్‌లను పరిశోధకులు విశ్లేషించి అల్గోరిథం ఇచ్చిన ఫలితాలను ప్రామాణిక డిప్రెషన్ ప్రశ్నపత్రాలతో పోల్చినప్పుడు ఈ మేరకు ఫలితాలు వచ్చాయి. అయితే ఈ విధానం క్లినికల్ డయాగ్నోసిస్‌కు ఏమాత్రం ప్రత్యామ్నాయం కాదని పరిశోధకులు స్పష్టం చేశారు.

వందలసార్లు చార్జ్ చేసినా... అస్సలు తగ్గని సామర్థ్యం!

జింక్ అయాన్ బ్యాటరీ ఆవిష్కరణ

నీటి ఆధారిత మూలకాలతో తయారీ

మనం ప్రస్తుతం వాడుతున్న బ్యాటరీలన్నీ మండే స్వభావమున్న రసాయనాలతో తయారు చేసినవే. వాటికి పూర్తి భిన్నంగా నీటి ఆధారిత అణువులతో రూపొందిన వినూత్న జింక్ అయాన్ బ్యాటరీని సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మెటీరియల్స్ (సీఈఎన్ఎస్) పరిశోధకులు అభివృద్ధి చేశారు. దీంతో పునరుద్పాతక ఇంధన నిల్వ మరింత భద్రంగా, చవగ్గా, విశ్వసనీయంగా మారనుంది. ఈ విధానంలో తయారైన జింక్ అయాన్ బ్యాటరీని 500 సార్లు చార్జ్ చేసి వాడాక కూడా అచ్చం కొత్తదాని మాదిరిగా ఏకంగా 98 శాతం సామర్థ్యంతో పని చేస్తోందని పరిశోధకులు వెల్లడించారు! సౌర ఫలకాలు, విండ్ టర్బైన్ల నుంచి తయారైన విద్యుత్‌ను నిల్వచేసేందుకు దోహదపడే జింక్ భూమిపై చవగ్గా, సులభంగా, విస్తారంగా లభిస్తుంది. బ్యాటరీలో జింక్ ఒకవైపు పొరగా పనికొస్తుంది. మరోవైపు క్యాథోడ్‌గా ఏ మూలకాన్ని వాడాలనేది ఇన్నాళ్లూ సమస్యగానే మిగిలిపోయింది. ఈ సవాలుకు మాలిబ్డినం డైసలై?పడ్‌తో సీఈఎన్ఎస్ శాస్త్రవేత్తలు పరిష్కారం చూపారు. మాలిబ్డినం, సల్ఫర్‌లతో దాన్ని తయారుచేశారు. సల్ఫర్ నుంచి అత్యంత పల్చటి పొరలను అభివృద్ధి చేశారు. అవి శక్తిని నిల్వ చేసుకోవడమే గాక నిరంతరాయంగా సరఫరా కూడా చేయగలవని నిరూపించారు. నియంత్రిత వేడి వ్యవస్థ విధానం ద్వారా దీన్ని సుసాధ్యంచేశారు. దీంతో బ్యాటరీని చార్జ్ చేసినప్పుడు శక్తి సులభంగా లోపలికి వెళ్లడమే గాక అంతే సులభంగా డిశ్చార్జ్ అవుతోంది. భద్రమైన, అత్యంత సుస్థిరమైన ఆపరేటింగ్ పరిమితి అయిన 0.2--1.3 ఓల్ట్ స్థాయిని శాస్త్రవేత్తలు సాధించారు. తద్వారా బ్యాటరీ పాడవకుండా వందలసార్లు చార్జ్ చేసుకుని వాడుకోవచ్చు. చార్జింగ్ అనంతరం వాడే క్రమంలో కేవలం 0.3 శాతం శక్తి మాత్రమే వృథాగా పోతోంది. మిగతాదంతా బ్యాటరీలోనే నిల్వ ఉంటోంది. ఇలా 99.7 శాతం 'కొలంబిక్ ఎఫీషియెన్సీ' సాధించడం విశేషం. ఈ కాయిన్--సెల్ నమూనా బ్యాటరీని ఎల్‌సీడీ టైమర్‌కు చార్జింగ్ పెట్టడం ద్వారా వాణిజ్య స్థాయిలో విజయవంతంగా పరీక్షించారు. ఈ పరిశోధన వివరాలు అమెరికా కెమికల్ సొసైటీ 'ఎనర్జీ అండ్ ఫ్యూయల్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

షాక్..అధికారులపై వీధి కుక్కల్ని వదిలిన బాధితులు

ముంబై: ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన ఆందోళనకారులు వినూత్నంగా నిరసన తెలిపారు. అధికారుల మొండి వైఖరికి నిరసనగా ఏకంగా వీధి కుక్కలను పట్టుకెళ్లి ప్రభుత్వ కార్యాలయంలోని అధికారుల టేబుల్‌పైనే వదిలారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మహారాష్ట్రలోని నాసిక్‌లో వీధి కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై బాధితులు ఎన్నోసార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో సహనం కోల్పోయిన ప్రతిపక్ష శివసేన విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు విక్రమ్ వినూత్న రీతిలో నిరసనకు దిగారు. ఇందులో భాగంగా నిప్పహాడ్ నగర్ పంచాయతీ ఆఫీస్ చీఫ్ ఆఫీసర్ ధరేజ్ కార్యాలయానికి వెళ్లారు. ఆయన ఆఫీస్ గదిలో ఉండగానే లోపలికి ప్రవేశించి, అధికారుల టేబుళ్లు కుర్చీలపై ఆ కుక్కలను వదిలిపెట్టారు. అధికారులకు సమస్య తీవ్రతను కళ్లకు కట్టేందుకే తాము ఈ పద్ధతిని ఎంచుకున్నామని ఆందోళనకారులు తెలిపారు. కార్యాలయంలో కుక్కలు తిరుగుతుండటంతో అధికారులు, సిబ్బంది కొద్దిసేపు బెంబేలెత్తిపోయారు. ఈ వినూత్న నిరసన కార్యక్రమం ప్రస్తుతం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.ం

వైఎస్ జగన్‌ను కలిసిన నిరుద్యోగులు

తాడేపల్లి: గ్రూప్-1, గ్రూప్-2 అభ్యర్థుల వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ పలువురు నిరుద్యోగులు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్ జగన్‌ను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ.. ఫేజ్-2 జాబ్ క్యాలెండర్‌లో ప్రభుత్వం ఇచ్చిన రెండేళ్ల వయో సడలింపు సరిపోదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రెగ్యులర్‌గా నోటిఫికేషన్లు రాకపోవడం వల్లే వయోపరిమితి దాటిపోయి లక్షలాది మంది యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నామని ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఉన్న 44 ఏళ్ల వయోపరిమితిని వన్‌టైమ్ సడలింపు కింద 47 ఏళ్లకు పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకునేలా చొరవ చూపాలని కోరారు. నిరుద్యోగుల సమస్యలు, విజ్ఞప్తులపై వైఎస్ జగన్ సానుకూలంగా స్పందించారు.

ఆ జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరిక

అమరావతి: పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరికను ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ జారీ చేసింది. అల్లూరి, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ అయ్యింది. ఆయా జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వెల్లడించింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, గుంటూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో తేలికపాటి వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. 40-60 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలపై ప్రస్తుతం కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈనెల 19 నాటికి ఉత్తర అండమాన్ ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాత మూడు, నాలుగు రోజుల్లో ఇది బలపడి దక్షిణ ఒడిస్సా--ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో వచ్చే వారం కోస్తాంధ్రలో వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. గురువారం అల్లూరి సీతారామరాజు, పోలవరం, కృష్ణా, గుంటూరు, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈదురుగాలులు కూడా వీస్తాయని తెలిపింది. ఇదిలావుండగా బుధవారం కాకినాడ జిల్లా రౌతులపూడిలో 6.8 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అనకాపల్లి జిల్లా మర్రిపాలెంలో 5.4, కాకినాడ జిల్లా డి.పోలవరంలో 4.8, కాకినాడ జిల్ల కోనపాపపేట 4.6, విశాఖ జిల్లా అక్కిరెడ్డిపాలెంలో 4.5, అనకాపల్లిలో 4.4, పాయకరావుపేటలో 4.3 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. మరోవైపు పలుచోట్ల ఎండల తీవ్రత కొనసాగింది. పగటిపూటి వేసవిని తలపించేలా ఎండలు మండాయి.

కేసీఆర్ ఫాం హౌస్‌కు రెవెన్యూ అధికారులు.. అసలేం జరగనుంది?

సిద్దిపేట: ఎర్రవల్లిలోని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ వేగవంతమైంది. ఇందులో భాగంగా మరికాసేపట్లో రెవెన్యూ అధికారులు ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్‌ను సందర్శించనున్నారు. ఈ విచారణ నేపథ్యంలో కేసీఆర్‌కు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మర్కుక్ రెవెన్యూ కార్యాలయంలో అధికారులు సంబంధిత ఫైళ్లు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కేసీఆర్ ఫాంహౌస్ భూములపై సీఎం రేవంత్ రెడ్డి నిన్న విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సిద్దిపేట కలెక్టర్ హైమావతి అధికారులతో సమావేశమై ఫాంహౌస్ భూములపై సమీక్ష నిర్వహించారు. మరోవైపు, శుక్రవారం సిద్దిపేటలో కాంగ్రెస్ ఎంపీలు పర్యటించనున్నారు. కబ్జా ఆరోపణలున్న భూమలను వారు పరిశీలించడంతో పాటు, రెవెన్యూ అధికారులతో సమావేశమై ప్రస్తుత పరిస్థితిపై చర్చించనున్నారు. ఈ పరిణామాలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

అంతరిక్ష యుద్ధానికి మనం సిద్ధమా?

అంతరిక్షంలో ఆయుధం ఉందన్న అమెరికా ప్రకటన ఇప్పుడు సర్వత్రా ప్రకంపనలు సృష్టిస్తోంది. భవిష్యత్తులో యుద్ధం నేలపై నుంచి కాకుండా అంతరిక్షంలోనే మొదలైతే... ఉపగ్రహాలే లక్ష్యంగా సాగితే తట్టుకోవడం ఎలా అన్న ప్రశ్న పలు దేశాల్లో మొదలైంది. రష్యా, చైనా లాంటి దేశాలు అంతరిక్ష యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు తగిన సాధన సంపత్తిని సమకూర్చుకున్నట్లు వార్తలు వస్తుండగా.... అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో ఉన్న భారత్ పరిస్థితి ఏమిటి? ఉపగ్రహాలను కూల్చే సత్తా మనకుందా? ఉంటే.. అమెరికా మాదిరిగానే మనమూ అంతరిక్షంలో మనదైన అస్త్రాన్ని సిద్ధంగా ఉంచగలమా? ఆసక్తికరమైన ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవిగో... ఉపగ్రహాలను కూల్చేయగల సత్తా భారత్‌కు ఇప్పుడు కాదు... ఏడేళ్ల క్రితం అంటే 2019లోనే సమకూరింది. 'మిషన్ శక్తి'పేరుతో ఈ ఉపగ్రహ విధ్వంసక ఆయుధ వ్యవస్థను భారత్ పరీక్షించింది. అగ్రరాజ్యాలు అమెరికా, ఒకప్పటి సోవియట్ యూనియన్‌ల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జోరుగా సాగుతున్న కాలంలో పురుడుపోసుకున్న ఈ ఉపగ్రహ విధ్వంసక ఆయుధాల ఆలోచన ఆ తరువాత బహుముఖంగా విస్తరించింది. అమెరికా 1985లోనే ఎఫ్--15 యుద్ధ విమానం ద్వారా 11.6 కిలోమీటర్ల ఎత్తుకు ఎగసి అక్కడి నుంచి ఏఎస్ఎం--135 క్షిపణిని ప్రయోగించింది. ఈ క్షిపణి 555 కిలోమీటర్ల ఎత్తులో తిరుగుతున్న శాస్త్రీయ ఉపగ్రహం ఒకదాన్ని ధ్వంసం చేసింది కూడా. ఇలా క్షిపణుల సాయంతో ఉపగ్రహాలను ధ్వంసం చేయగల వ్యవస్థలను కైనెటిక్ డైరెక్ట్ అసెంట్ ఏశాట్‌లని పిలుస్తారు. నేల, సముద్రం, గాల్లోంచి కూడా ప్రయోగించగలగడం వీటి ప్రత్యేకత. కక్ష్యలో తిరుగుతున్న ఉపగ్రహాన్ని గుర్తించేందుకు, కచ్చితంగా దాన్ని బలంగా ఢీకొనేందుకు శక్తిమంతమైన రాడార్లు, ఆప్టికల్ సెన్సర్లను ఉపయోగిస్తారు. ఎక్కడో వందల కిలోమీటర్ల



దూరంలో కంటికి కనిపించని, నిత్యం కదులుతూ ఉండే ఉపగ్రహాలను గుర్తించడం, క్షిపణులతో ఢీకొట్టడం అంతా చాలా సంక్లిష్టమైన వ్యవహారం. అందుకే డబ్బు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న దేశాలు మాత్రమే ఈ వ్యవస్థలను అభివృద్ధి చేయగలిగాయి. 1985లో అమెరికా మొట్టమొదటిసారి ఈ రకమైన వ్యవస్థలను ప్రయోగించి విజయం సాధిస్తే చైనాకు 2007 వరకూ సాధ్యపడలేదు. రష్యా 2021లో కాస్మోస్1408 ఉపగ్రహాన్ని ధ్వంసం చేసి తనకూ ఏశాట్‌లు ఉన్నాయని ప్రకటించుకుంది.

మన పరిస్థితి ఏమిటి?

ముందుగా చెప్పుకున్నట్లు మిషన్ శక్తితో మనకు ఉపగ్రహాలను కూల్చేయగల సామర్థ్యం సమకూరింది. ఈ సత్తా కలిగిన నాలుగవ దేశంగా అవతరించింది. మిషన్ శక్తిలో భాగంగా రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) పృథ్వీ క్షిపణికి కొన్ని మార్పులు చేసి ప్రయోగించింది. 2019 మార్చి 27న ఒడిశాలోని అబ్దుల్ కలామ్ దీవి నుంచి నింగికి ఎగసిన ఈ మూడు దశల పృథ్వీ క్షిపణి అంతకు రెండు నెలల క్రితం ఇస్రో రాకెట్ ద్వారా భూమి లో ఎర్త్ ఆర్బిట్‌లోకి చేరిన మైక్రోశాట్--ఆర్ ఉపగ్రహాన్ని ఢీకొని నాశనం చేసింది. నేరుగా ఢీకొట్టడం ద్వారా మాత్రమే పృథ్వీ క్షిపణి ఉపగ్రహాన్ని నాశనం చేయడం గుర్తించాల్సిన విషయం. అంటే.. క్షిపణిలో ఎలాంటి పేలుడు సామగ్రిని వాడలేదన్నమాట. ప్రయోగం తరువాత జరిపిన పరిశీలనల్లో క్షిపణి ఉపగ్రహాన్ని ధ్వంసం చేయడంలో విజయవంతమైందని స్పష్టంగా తెలిసింది. దీనర్థం అంతరిక్షంలో తిరిగే ఉపగ్రహాలను గుర్తించి.. దాని దారిని పరిశీలిస్తూ... అడ్డుకుని పేల్చేయగల సత్తా భారత్‌కు ఉందీ అని!!! ఇప్పుడు పృథ్వీ క్షిపణిలో పేలుడు పదార్థం ఉందని ఒక్కసారి ఊహించుకోండి...

మధుమేహానికి బ్యాక్టీరియాతో చెక్?

ఈ-కోలీతో చైనా శాస్త్రవేత్తల ప్రయోగాలు మానవ ప్రయోగాల తర్వాతే అందుబాటులోకి

మన పేవుల్లో ఉండే కోటానుకోట్ల బ్యాక్టీరియా రకాల్లో ఈ--కోలీ ఒకటి. తిన్న ఆహారం జీర్ణమయ్యేందుకు సాయపడుతుంది. కొన్ని రకాలతో ఆరోగ్య సమస్యలూ వస్తాయి. అలాంటి బ్యాక్టీరియాతో టైప్--2 మధుమేహానికి చికిత్స కూడా అందించవచ్చు అంటున్నారు శాస్త్రవేత్తలు! ప్రీ క్లినికల్ ట్రయల్స్ దాటుకుని జంతు ప్రయోగాల దశకు చేరిన ఈ ఆసక్తికర పరిశోధన వివరాలు.. భారతదేశం ప్రపంచ మధుమేహ రాజధాని అంటూంటారు. కనీసం పది కోట్ల మంది ఈ జీర్ణక్రియ సమస్యతో బాధపడుతున్నారని అంచనా. ప్రపంచం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఈ సంఖ్య ఇంతకంటే ఎక్కువ. రోజూ మందులేసుకోవడం, అవి చాలకపోతే ఇన్సులిన్ ఇంజెక్షన్లు... వీటితో వచ్చే సైడ్ ఎఫెక్ట్‌లు ఎవరికైనా భరించలేని వేదనే. అందుకే మధుమేహానికి మెరుగైన చికిత్స కోసం ప్రపంచవ్యాప్తంగా ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. తాజాగా చైనాలోని ఈస్ట్ చైనా నార్మల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఈ వ్యాధికి ఒక వినూత్నమైన పరిష్కారాన్ని సూచించారు. గ్లూకోజును పసిగట్టే జన్యు రిసెప్టర్లను ఈ--కోలీ బ్యాక్టీరియాలోకి ప్రవేశపెట్టారు. చక్కెర నిర్దిష్ట స్థాయి కంటే ఎక్కువైతే చాలు... ఈ బ్యాక్టీరియా జీఎల్‌పీ--1 హార్మోన్‌ను విడుదల చేస్తుంది. ఇంకోలా చెప్పాలంటే.. ఈ బ్యాక్టీరియా కారణంగా ఊబకాయాన్ని తగ్గించుకునేందుకు వాడే ఒజెంపిక్‌తోపాటు సెమాగ్లూటైడ్ వంటి మందులు శరీరంలోనే తయారై విడుదలవుతాయన్నమాట.

ఇదీ సమస్య...

శరీరంలోని రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగితే ఇన్సులిన్ విడుదల చేయమని కాలేయానికి సందేశాలు వెళతాయి. ఈ ఇన్సులిన్ కాస్తా గ్లూకోజును మన కణాల తలుపులు తెరిచి గ్లూకోజు లోపలికి చొచ్చుకెళ్లేందుకు సాయపడతాయి. తగినంత గ్లూకోజు కణాల్లోకి చేరిన తరువాత ఇన్సులిన్ విడుదల కూడా తగ్గిపోతుంది. దీంతో కాలేయం అవసరాలకు తగ్గట్టు మళ్లీ చక్కెర తయారు చేసి రక్తంలోకి వదులుతూంటుంది. అయితే మధుమేహం ఉన్నవారిలో ఈ వ్యవస్థ సరిగ్గా పనిచేయదు. కణాలు ఇన్సులిన్‌కు స్పందించడం మానేస్తాయి. ఫలితంగా చక్కెర రక్తంలోనే ఉండిపోతుంది.

సెమాగ్లూటైడ్ వంటి మందులు ఇన్సులిన్ స్థాయిలను పెంచి గ్లూకోజు ఖర్చయ్యేందుకు సాయపడతాయి. ఈస్ట్ చైనా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఈ--కోలీ బ్యాక్టీరియానే రక్తంలోని గ్లూకోజు స్థాయిలను బట్టి జీఎల్‌పీ--1 హార్మోన్ విడుదల చేసేలా చేశారు. అవసరమైనప్పుడు మాత్రమే ఇన్సులిన్ విడుదల అవుతూండటం వల్ల సైడ్ ఎఫెక్ట్‌లు ఉండే అవకాశాలు తక్కువ. మధుమేహం ఉన్న కొన్ని రకాల కోతులు, ఎలుకలపై ఇప్పటికే తాము ఈ బ్యాక్టీరియాను ప్రయోగించామని, మంచి ఫలితాలే వచ్చాయని శాస్త్రవేత్తలు తెలిపారు. హానికర ప్రభావాలు కూడా లేనట్లు స్పష్టమైనట్లు చెప్పారు. మానవ ప్రయోగాలు కూడా నిర్వహించి సత్ఫలితాలు సాధిస్తే ఈ బ్యాక్టీరియా చికిత్స టైప్--2 మధుమేహ బాధితులకు వరం కాగలదనడంలో సందేహం లేదు.

ఐపీవోలకు గ్రే మార్కెట్ జోష్

కొద్ది రోజులుగా సెకండరీ మార్కెట్లు కన్సాలిడేషన్ బాటలో సాగుతుంటే.. మరోపక్క ప్రైమరీ మార్కెట్లు పలు ఇష్యూలతో సందడి చేస్తున్నాయి. ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందనను అందుకోవడంతోపాటు.. లాభాల లిస్టింగ్‌తో ఐపీవో మార్కెట్లో జోష్ పెంచుతున్నాయి. ఫలితంగా కొత్త ఇష్యూలకు గ్రే(అనధికార అన్‌లిస్టెడ్) మార్కెట్లో ప్రీమియం పెరుగుతోంది. వెరసి ఇన్వెస్టర్లకు బస్ మిస్సవుతున్నామన్న ఆందోళన(ఫోమో) పెరిగి దరఖాస్తు చేసేందుకు క్యూ కడుతున్నారు. తాజాగా లిస్టయిన షిప్‌రాకెట్ ఇష్యూ ధర రూ. 97కాగా.. రూ. 143 వద్ద నిలిచింది. రూ. 285 ధరతో పోలిస్తే బెహారీలాల్ ఇంజనీరింగ్ రూ. 503 వద్ద స్థిరపడింది. ఇక ప్రస్తుతం మిల్కీ మిస్ట్ డెయిరీ(రూ. 140) తాజాగా 10 శాతం అప్పర్ సర్క్యూట్ తాకి రూ. 200 వద్ద ఫ్రీజయ్యింది. ఈ బాటలో మాల్బియో(రూ. 807) రూ. 1,177కు ఎగసి రూ.1,037 వద్ద ముగిసింది. ధూత్ ట్రాన్స్‌మిషన్(రూ. 871) రూ. 1,404 వద్ద, టెక్నోక్రాఫ్ట్(రూ. 212) రూ. 315 వద్ద, ఎంవీ ఎలక్ట్రోసిస్టమ్స్(రూ. 425) రూ. 570 వద్ద ముగిశాయి.

అనధికార ప్రీమియం...

ఇటీవల పలు కంపెనీలు లాభాలతో లిస్టవుతుండటంతో ఐపీవోకు వచ్చే కంపెనీల షేర్లు ముందుగా ట్రేడయ్యే అనధికార(గ్రే) మార్కెట్లో ప్రీమియం పలుకుతున్నాయి. ఫలితంగా కొత్త ఇష్యూలకు చిన్న ఇన్వెస్టర్లు క్యూ కడుతున్నారు. దీంతో షిప్‌రాకెట్‌కు రిటైలర్ల విభాగంలో 46 రెట్లు, బెహారీ లాల్‌కు 53 రెట్లు అధికంగా స్పందన లభించింది. ఈ బాటలో ఆగ్మంట్, టెంప్సన్స్, సన్‌షైన్ పిక్చర్స్, స్కైవేస్ ఎయిర్, లలితా జ్యువెలరీ ఇష్యూలకు గ్రే మార్కెట్లో ప్రీమియం ధర పలుకుతోంది.

ఐపీవో వేవ్...

రూ. 2,600 కోట్ల సమీకరణ లక్ష్యంగా హారిజన్ ఇండస్ట్రియల్ పార్క్స్, రూ. 1,700 కోట్ల సమీకరణ లక్ష్యంతో లలితా జ్యువెలరీ ఐపీఓలు బుధవారం(19న) ముగిశాయి. ఈ బాటలో నేడు(గురువారం) షేరుకి రూ. 88--93 ధరల శ్రేణితో ఆభరణ వర్తక సంస్థ శంకేష్ జ్యువెలర్స్, రూ. 342--360 ధరల శ్రేణితో టీవీ ప్రొడక్షన్ సంస్థ సన్‌షైన్ పిక్చర్స్ ఐపీవోలు ముగియనున్నాయి.

మరో 4 కంపెనీలు...

గజా క్యాపిటల్ బ్రాండ్‌తో కార్యకలాపాలు నిర్వహిస్తున్న గజా ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ ఐపీవో బుధవారం(19న) ప్రారంభమైంది. ఇందుకు ధరల శ్రేణి షేరుకి రూ. 152--160కాగా.. తద్వారా రూ. 550 కోట్లు అందుకునే యోచనలో ఉంది. టెంప్సన్స్ ఇన్‌స్ట్రుమెంట్స్(ఇండియా) ఐపీవో నేడు(20న) ప్రారంభంకానుంది. రూ. 825 కోట్ల సమీకరణ కోసం గోల్డ్ అండ్ సిల్వర్ ప్లాట్‌ఫామ్.. ఆగ్మంట్ ఎంటర్‌ప్రైజెస్ రేపు(21న) పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఈ బాటలో సోమవారం(24న) లాజిస్టిక్స్ కంపెనీ స్కైవేస్ ఎయిర్ సర?వసెస్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. తద్వారా రూ. 583 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. గత వారం ఐదు కంపెనీలు ఐపీవోలు చేపట్టగా.. ఈ నెల మొదట్లో మరో మూడు కంపెనీలు నిధుల సమీకరణ చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో 2026లో లిస్టింగ్ బాట పట్టిన కంపెనీల సంఖ్య 55కు చేరనుంది.

రెండు లిస్టింగ్‌లు సూపర్ హిట్..!

ఇటీవల పబ్లిక్ ఇష్యూ పూర్తి చేసుకొని, సెకండరీ మార్కెట్లోకి కొత్తగా అడుగుపెట్టిన రెండు కంపెనీల షేర్లు లిస్టింగ్ రోజే ఇన్వెస్టర్లకు లాభాల పంట పండించాయి. 'షిప్‌రాకెట్ లిమిటెడ్' షేరు ఇష్యూ ధరతో పోలిస్తే 48% పెరగ్గా, 'బెహారీలాల్ ఇంజనీరింగ్' షేరు సైతం ఏకంగా 76% ప్రీమియంతో మెరిసింది.

'షిప్ రాకెట్' మ్యాజిక్ ..!

టేమాసెక్, జొమాటోల పెట్టుబడులున్న ఈ--కామర్స్ ప్లాట్‌ఫామ్ 'షిప్‌రాకెట్' షేరు తొలి రోజే దూసుకెళ్లింది. ఇష్యూ ధర (రూ.97)తో పోలిస్తే బీఎస్ఈలో 34% ప్రీమియంతో రూ.130 వద్ద ప్రారంభమైంది. మార్కెట్ అనిశ?చతుల్లోనూ ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. చివరికి 48% లాభంతో రూ.143 గరిష్ట స్థాయి వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.10,441 కోట్లకు చేరింది.

బెహారీలాల్ భళా..!

ఐరన్, స్టీల్ తయారీ సంస్థ 'బెహారీలాల్ ఇంజనీరింగ్' షేరు మెప్పించింది. ఇష్యూ ధర (రూ.285)తో పోలిస్తే బీఎస్ఈలో 61% ప్రీమియంతో రూ.458 వద్ద లిస్టయ్యింది. ఒకానొక దశలో 89% శాతం ఎగబాకి రూ.537 గరిష్టాన్ని అందుకుంది. చివరకు 76% లాభంతో రూ.503 వద్ద ముగిసింది. ఈ కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.2,125.91 కోట్లుగా నమోదైంది.

లలితా జ్యువెలరీ.. భేష్

ఐపీవోకు 63 రెట్లు స్పందన

రూ. 190--201 ధరల శ్రేణిలో ఐపీవోకు వచ?చన లలితా జ్యువెలరీకి ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించింది. ఇష్యూ జ్యువెలరీ కంపెనీలలోనే అత్యధికంగా 63 రెట్లు సబ్?రస్కయిబ్ అయ్యింది. 6,27,61,403 షేర్లు ఆఫర్ చేయగా.. 395 కోట్ల షేర్లకుపైగా బిడ్స్ దాఖలయ్యాయి. క్విబ్ విభాగంలో 145 రెట్లు, సంపన్న వర్గాల నుంచి 74 రెట్లు, రిటైలర్ల నుంచి 12 రెట్లు చొప్పున దరఖాస్తులు లభించాయి. ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 1,700 కోట్లు సమీకరించింది. ఈ నెల 24న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్ట్‌కానుంది.

రెడ్ డ్రెస్ లో మానస అందాలు..

సోషల్ మీడియాను ఈ మధ్య సెలబ్రిటీలు పాపులారిటీ సంపాదించుకోవడానికి ఆయుధంగా మలుచుకుంటున్నారు. అందులో భాగంగానే అందాలు ఆరబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా తమ ట్రెండీ ఫ్యాషన్స్ తో అటు ఫ్యాషన్ ప్రియులను కూడా మెప్పిస్తున్నారు. ముఖ్యంగా తమ డ్రెస్ సెన్స్ తో అమ్మాయిలకు సరికొత్త ఫ్యాషన్ ను పరిచయం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మధ్యకాలంలో కాలేజ్ కి వెళ్ళే అమ్మాయిలు కూడా హీరోయిన్స్ డ్రెస్సింగ్ ను ఫాలో అవుతున్నారు అంటే ఇక సెలబ్రిటీలు ఏ రేంజ్ లో యువతను ఆకట్టుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. కాలానుకనుగుణంగా చాలా అందంగా తయారవుతూ అభిమానులను ఆకట్టుకుంటున్న ఈ ముద్దుగుమ్మలు.. అటు ఫాలోవర్స్ ని కూడా పెంచుకుంటున్నారు. ఒకవైపు అందాలు ఆరబోస్తూ మరొకవైపు కొన్ని ఉత్పత్తులను ప్రమోట్ చేస్తూ భారీగా ఆదాయాన్ని పెంపొందించుకుంటున్న విషయం తెలిసిందే . ఇదిలా ఉండగా ఇప్పుడు తన అందంతో ఆకట్టుకోవడమే కాకుండా తన సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఇలా ఘాటు మిర్చీలా రెడ్ డ్రెస్ లో ఫోటోలు షేర్ చేసి అందరినీ ఆకట్టుకుంది మానస వారణాసి.అందం , అభినయంతో అభిమానులను ఆకట్టుకునే ఈ చిన్నది సింపుల్ స్టైల్ తో మనసుకు హత్తుకునేలా ఫోటోలకు ఫోజులిచ్చింది.

విషయంలోకి వెళ్తే.. సంతోష్ శోభన్ హీరోగా మానస వారణాసి హీరోయిన్గా తెరకెక్కుతున్న చిత్రం కపుల్ ఫ్రెండ్లీ . ఫిబ్రవరి 14వ తేదీన వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో ఇటీవల మంగళవారం హైదరాబాదులో ఒక ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర బృందం. అందులో భాగంగానే తన అద్భుతమైన డ్రెస్సింగ్ సెన్స్ తో అందర్నీ ఆకట్టుకున్న ఈమె.. అవే ఫోటోలను ఫోటోషూట్ నిర్వహించి సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఇందులో సింపుల్ స్టైల్ తో ఆకట్టుకుంటూనే మరొకవైపు గార్జియస్ లుక్ లో కనిపించి ఆడియన్స్ హృదయాలను దోచుకుంది. అసలు గుట్టు విప్పిన నిఖిల్ ఇకపోతే ఈ లుక్ లో ఈమెను చూసిన కొంతమంది అభిమానులు జూనియర్ అనుపమ అంటూ కామెంట్ కూడా చేస్తున్నారు. మొత్తానికైతే మానస వారణాసి పంచుకున్న ఈ లేటెస్ట్ ఫోటోషూట్ విపరీతంగా వైరల్గా మారింది. ఇకపోతే వాలెంటైన్స్ డే సందర్భంగా తన సినిమా విడుదలవుతున్న నేపథ్యంలో.. తాజాగా నిర్వహించిన ప్రెస్ మీట్ లో మానస వారణాసి మాట్లాడుతూ.. ప్రేమపై తన అభిప్రాయాన్ని చెప్పుకొచ్చింది. మనం మన ఇంట్లో మన కుటుంబ సభ్యుల మధ్య ఎంత భద్రతగా ఫీల్ అవుతామో ..ప్రేమికుడి వద్ద అంతే భద్రతగా ఉండాలి. అదే అసలైన ప్రేమకు నిర్వచనం అంటూ చెప్పుకొచ్చింది.. మొత్తానికైతే అటు తన నటనతోనే కాదు ఇటు అద్భుతమైన అభిప్రాయాలను పంచుకుంటూ వార్తల్లో నిలుస్తోంది మానస వారణాసి. మానస వారణాసి తెలంగాణకు చెందిన మోడల్.. కోకోకోల మ్యూజిక్ హాల్ 2021 భారతదేశం తరఫున మిస్ వరల్డ్ పోటీలలో ప్రాతినిధ్యం వహించి పదవ స్థానంలో నిలిచింది.

ప్రొటీన్లతో అలసట మాయం!

ఉదయాన్నే నిద్ర లేచింది మొదలు.. ఊపిరి సలపని పనులతో క్షణం తీరిక ఉండదు. మరోవైపు ఆఫీసులో ఒత్తిడి, అలసటతో సతమతమవుతాం. ఇలాంటి బిజీ లైఫ్స్టైల్తో ఎదురయ్యే అలసటను దూరం చేసుకొని చురుగ్గా మారాలంటే ప్రొటీన్లు నిండిన ఆహార పదార్థాలను రోజువారీ డైట్లో చేర్చుకోవాలని చెబుతున్నారు నిపుణులు.

నట్స్

ప్రొటీన్లతో నిండిన బాదంపప్పు, పిస్తా, అక్రోట్.. వంటి గింజలను ప్రతిరోజూ మితంగా తీసుకోవడం మంచిది. అవి గుండెకు మేలు చేస్తాయట. సలాడ్లు, ఉడికించిన కూరగాయలతో కూడా వీటిని కలుపుకొని తినొచ్చు. అయితే నట్స్లో క్యాలరీలు కూడా ఎక్కువగానే ఉంటాయి కాబట్టి మితంగానే తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.

పాలు, పాల పదార్థాలు

కండరాల నిర్మాణానికి తోడ్పడే ప్రొటీన్లు పాలు, పాల పదార్థాల్లో పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటు అదుపులో ఉంచడానికీ తోడ్పడతాయట. ఈ క్రమంలో తక్కువ కొవ్వులుండే పాల

పదార్థాలను తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.

సోయాబీన్స్

సోయాబీన్స్లో ప్రొటీన్ల మోతాదు ఎక్కువ. వీటిని సోయా పాలు, సోయా పేస్ట్, టోఫూ రూపంలోనూ తీసుకోవచ్చు. అయితే ఇవి కొంతమందికి పడకపోవచ్చు. అలాంటి వారు వీటిని తీసుకునే విషయంలో వైద్యులను సంప్రదించాలి.

ఇవి కూడా!

జి బఠాణీలు, రాజ్మా, బీన్స్, చిక్కుళ్లు, ఇతర కూరగాయల్లోనూ ప్రొటీన్ ఉంటుంది. జి చేపల్లో ప్రొటీన్లతో పాటు గుండెకు మేలు చేసే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలూ ఎక్కువగానే ఉంటాయి. జి మాంసాహారంలోనూ ప్రొటీన్లు మెండుగా ఉంటాయి. అయితే వీటిలో కొవ్వులు కూడా ఎక్కువగా ఉంటాయి కాబట్టి మితంగానే తీసుకోవాలంటున్నారు నిపుణులు. జి కోడిగుడ్డులో కూడా ప్రొటీన్ ఉంటుంది. కానీ కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్న వారు, గుండెజబ్బులు.. వంటి సమస్యలున్న వారు డాక్టర్ సలహా తీసుకున్న తర్వాతే వీటిని ఆహారంలో చేర్చుకోవాలి

మినీ ఫ్రాక్ లో పిచ్చెక్కిస్తున్న సిమ్రాన్ చౌదరి..

ఒకవైపు సినిమాలతో బిజీగా ఉంటూనే.. మరొకవైపు అభిమానులను అలరించడానికి నిత్యం పరితపిస్తున్న హీరోయిన్స్ ఎంతోమంది ఉన్నారు. ముఖానికి మేకప్ వేసుకుని కెమెరా ముందు దర్శనమిచ్చే ఈ అమ్మాయిలు.. తమ అందాలతో యువతను విపరీతంగా అలరిస్తున్నారు అనడంలో సందేహం లేదు. నిత్యం సినిమా షూటింగ్ లతో బిజీగా ఉండే ఈ హీరోయిన్స్ అభిమానులను ఎప్పటికప్పుడు అలరించడానికి భిన్న విభిన్నమైన వస్త్రధారణలతో అలరిస్తున్న విషయం తెలిసిందే. ఇకపోతే ఫోటోషూట్ అంటూ ప్రత్యేకంగా కొన్ని ప్రదేశాలను కూడా ఎంపిక చేసుకొని తమ అందాలతో ఆడియన్స్ హృదయాలను దోచుకుంటున్నారు. అందులో భాగంగానే ప్రముఖ యంగ్ బ్యూటీ సిమ్రాన్ చౌదరి కూడా తన అందాలతో ఆకట్టుకోవడానికి మరోసారి అభిమానుల ముందుకు వచ్చేసింది. అయితే ఈసారి తన ఫోటోషూట్ ను టెన్నిస్ కోర్టు నుంచి షేర్ చేసుకోవడం గమనార్హం. స్కై బ్లూ అండ్ వైట్ మినీ స్కర్ట్ ధరించి తన అందాలతో మెస్మరైజ్ చేసింది. పైగా ఉల్లి పొరలాంటి వైట్ కలర్ షర్ట్ ధరించి పలు రకాల ఫోజులతో యువతను విపరీతంగా ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా సిమ్రాన్ చౌదరి షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడమే కాకుండా అమ్మడి అందానికి ముగ్ధులవుతున్నారు. విశ్వక్ సేన్ పాగల్, అథర్వ వంటి చిత్రాలతో భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న సిమ్రాన్ చౌదరి ఈ ఏడాది 'వనవీర' సినిమాతో కొత్త సంవత్సరాన్ని ప్రారంభించింది. 2026 జనవరి 1న విడుదలైన తెలుగు యాక్షన్ డ్రామా చిత్రంగా వచ్చిన ఈ చిత్రానికి అవినాష్ తిరువీధుల దర్శకత్వం వహించారు. నందు విజయ్ కృష్ణ తో కలిసి నటించారు. పౌరాణిక ప్రేరేపిత యాక్షన్ చిత్రమే కానీ అంచనాలు పెద్దగా లేకపోవడం వల్ల ఈ సినిమా బాక్సాఫీస్ వద్దగా రాణించలేదు. ఈ చిత్రానికి వివేక్ సాగర్ సంగీతాన్ని అందించారు. మరోవైపు టీవీ సిరీస్ 'మిషన్ తఫాసీ' లో కూడా నటిస్తోంది. ప్రస్తుతం ఇది షూటింగ్ దశలో ఉన్న విషయం తెలిసిందే. అలాగే తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న 'ఈ నగరానికి ఏమైంది?' సీక్వెల్ లో కూడా నటిస్తోంది. ప్రస్తుతం ఈ నగరానికి ఏమైంది రిపీట్ ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటుంది. కాలేజ్ ఫ్రెండ్షిప్, ఫన్, కలలు వంటి అంశాలను మిళితం చేస్తూ చాలా సహజంగా చూపించిన ఈ నగరానికి ఏమైంది అనే సినిమా అప్పట్లో సూపర్ హిట్ గా నిలిచింది . ఇప్పుడు ఆ సినిమాకు కొనసాగింపుగా ఈ నగరానికి ఏమైంది రిపీట్ అంటూ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. అక్టోబర్ లేదా నవంబర్ నెలలో ఈ సినిమాను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కూడా శరవేగంగా సాగుతోంది. మొత్తానికైతే సిమ్రాన్ చౌదరి ఇలా ఒకవైపు వరుస సినిమాలలో హీరోయిన్గా నటిస్తూనే.. మరొకవైపు అందాలు ఆరబోస్తూ అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది.

2027:టాప్ క్రేజీ పాన్ ఇండియా మూవీస్ ఇవే!

పాన్ ఇండియా సినిమాల ప్రవాహం తరువాత ఎక్కడా చూసినా, ఏ నోట విన్నా వినిపిస్తున్న మాట సౌత్..సౌత్.. బాలీవుడ్ ప్రభావం భారీగా తగ్గడం, క్రేజీ స్టార్ల సినిమాలు బాక్సాఫీస్ వద్ద భారీ డిజాస్టర్లుగా మారడంతో సౌత్తో పాటు నార్త్ ప్రేక్షకులు కూడా ఇప్పుడు సౌత్ సినిమాల జపం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది సౌత్ నుంచి భారీ క్రేజీ సినిమాలు బాక్సాఫీస్ వద్ద సందడి చేయబోతున్నాయి. వేల కోట్ల మేర బిజినెస్ చేయడానికి రెడీ అవుతున్నాయి. అందులో టాప్ 4 సినిమాలపై ఇప్పుడు ప్రత్యేకమైన చర్చ జరుగుతోంది. 2027లో అత్యంత హైప్పి సొంతం చేసుకున్న సినిమాలు రజనీ-కమల్ల కాంబినేషన్ల రానున్న భారీ మల్టీస్టారర్ ఒకటి. ఇదే తరహాలో అల్లు అర్జున్, అట్లీల కాంబినేషన్లో రూపొందుతున్న భారీ పాన్ వరల్డ్ మూవీ మరొకటి. జక్కన్న, సూపర్ స్టార్ మహేష్బాబుల తొలి కాంబినేషన్లో రూపొందుతున్న -వారణాసి- మూడవది. క్రేజీ సినిమాలతో దర్శకుడిగా ప్రత్యేకతను చాటుకుంటున్న సందీప్రెడ్డి వంగ, ప్రభాస్ కలయికలో రూపొందుతున్న మోస్ట్ యాంటిసిపేటెడ్ మూవీ -స్పిరిట్- నాలుగవది. ఈ వరుసలో రజనీ- కమల్ మూవీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిందే. దాదాపు 46 విరామం తరువాత మళ్లీ వీరిద్దరు కలిసి చేస్తున్న భారీ మల్టీస్టారర్ మూవీగా దీన్ని చెబుతున్నారు. డార్క్ కామెడీ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న ఈ మూవీకి -జైలర్- డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించనున్నాడు. ఇటీవలే దీనికి సంబంధించిన ఓ ప్రోమోని కూడా షూట్ చేసినట్టుగా తెలిసింది. ఈ ప్రాజెక్ట్పై భారీ అంచనాలున్నాయి. 80వ దశకం నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా దీన్ని నెల్సన్ తెరకెక్కించబోతున్నాడు. బిజినెస్ కూడా రికార్డు స్థాయిలో జరగనున్న ఈ మూవీ 2027లో వన్ ఆఫ్ ద టాప్ టాక్డ్ మూవీగా నిలుస్తుందని తెలుస్తోంది. -పుష్ప 2- వంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తరువాత బన్నీ కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ డైరెక్షన్లో భారీ పాన్ వరల్డ్ మూవీకి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. దీపిక పదుకునే మెయిన్ హీరోయిన్గా నటిస్తున్న ఈ మూవీని హాలీవుడ్ స్టార్ సూపర్ హీరో మూవీగా తెరకెక్కిస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్పై ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలోనే అత్యంత భారీ బడ్జెట్ ఫిల్మ్గా దీన్ని రూపొందిస్తున్నారు. రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ హీరోయిన్లుగా నటిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. అయితే రష్మిక ఇప్పటికే సెట్లోకి ఎంట్రీ ఇవ్వడం, యాక్షన్ ఘట్టాల్లో పాల్గొనడంతో సినిమాపై అంచనాలు తారా స్థాయికి చేరుకున్నాయి. హాలీవుడ్ టెక్నీషియన్లు ఈ మూవీకి వర్క్ చేస్తున్నారు. ఇది వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక సూపర్స్టార్ మహేష్ బాబు, జక్కన్నల తొలి కాంబినేషన్లో రూపొందుతున్న మూవీ -వారణాసి-. పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక విలన్ పాత్రలో నటిస్తుండగా గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్గా నటిస్తోంది. ప్రకాష్ రాజ్ కీలక పాత్రలో కనిపించనున్న ఈ మూవీని టైమ్ ట్రావెల్, మైథలాజికల్ డ్రామాగా రాజమౌళి తెరకెక్కిస్తున్నాడు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా హాట్ టాపిక్గా మారిన ఈ మూవీ వచ్చే ఏడాది ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది. ప్రభాస్ నటిస్తున్న భారీ యాక్షన్ డ్రామా -స్పిరిట్-. సందీప్రెడ్డి వంగ దర్శకుడు. ప్రకాష్రాజ్, కాంచన, వివేక్ ఓబెరాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. త్రిప్తి దిమ్రీ హీరోయిన్. ప్రభాస్ ఫస్ట్ టైమ్ పవర్ఫుల్ పోలీస్ ఆఫీసర్గా నటిస్తున్న ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. భారీ బడ్జెట్తో రూపొందుతున్న ఈ సినిమాతో బాక్సాఫీస్ రికార్డ్సని తిరగరాయాలని సందీప్రెడ్డి వంగ ప్లాన్ చేస్తున్నాడు. వచ్చే ఏడాది మార్చి 5న పాన్ ఇండియా మూవీగా ప్రేక్షకుల ముందుకు రానుంది. వీటితో పాటు -రామయణ 2- కూడా వచ్చే ఏడాదే రానుంది. 2027 దీపావళికి ఈ భారీ మూవీని రిలీజ్ చేయబోతున్నారు. ఫస్ట్ పార్ట్ 2026 దీపావళి సందర్భంగా నవంబర్ 8న రిలీజ్ కాబోతోంది.

బాలయ్య, వంశీతో మూవీ.. పవన్ డైరెక్టర్ ప్లాన్ ఏంటి?

టాలీవుడ్ లో ఇంట్రెస్టింగ్ కాంబినేషన్లకు ఎప్పుడూ స్పెషల్ క్రేజ్ ఉంటుందని చెప్పాలి. అలాంటి మరొక కాంబో ఇప్పుడు ఫిక్స్ అయినట్లు టాక్ వినిపిస్తోంది. నటసింహం నందమూరి బాలకృష్ణ, ప్రముఖ నిర్మాత నాగవంశీ, దర్శకుడు హరీష్ శంకర్ కాంబోలో మూవీ దాదాపు ఖరారైనట్లు వార్తలు వస్తున్నాయి. మరికొద్ది రోజుల్లో అధికారిక ప్రకటన కూడా రానుందని వినికిడి అయితే చాలా కాలంగా బాలయ్యతో సినిమా చేయాలన్న ప్రయత్నంలో ఉన్న హరీష్ శంకర్ కు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ దొరికిందన్న టాక్ వినిపిస్తోంది. నిజానికి మాస్ ఎంటర్టైన్మెంట్ సినిమాలు తీయడంలో హరీష్ శంకర్ టాలెంట్ తెలిసిందే. గబ్బర్ సింగ్, మిరపకాయ్, సుబ్రహ్మణ్యం ఫర్ సేల్ వంటి సినిమాలతో తన మార్క్ చూపించారు. ముఖ్యంగా స్టార్ హీరోలను మాస్ ఆడియన్స్ కు మరింత దగ్గర చేయడం ఆయన స్పెషాలిటీ. మిస్ ఇండియా కిరీటం మిస్ అయినా.. వెండితెర 'రంభ'గా ఆమె మేజిక్ తగ్గలేదు! ఇప్పుడు బాలయ్య బాడీ లాంగ్వేజ్ కు సరిపోయే పవర్ ఫుల్ స్టోరీ రెడీ చేశాడని సమాచారం. నాగవంశీ నిర్మాణంలో భారీ బడ్జెట్ తో ఆ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లనుందట. అయితే హరీష్ శంకర్ ప్రస్తుతం ఫామ్ లో లేరనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. ఇటీవల రవితేజతో చేసిన మిస్టర్ బచ్చన్ సినిమా భారీ అంచనాల మధ్య విడుదలై బాక్సాఫీస్ వద్ద తీవ్ర నిరాశ కలిగించింది. డిజాస్టర్ గా నిలిచిన ఆ సినిమా తర్వాత హరీష్ కెరీర్ పై ప్రశ్నలు తలెత్తాయి. సాధారణంగా ఇలాంటి సమయంలో హీరోలు దర్శకుల సెలెక్షన్ విషయంలో జాగ్రత్త పడుతుంటారు. ఫ్లాప్ ట్రాక్ లో ఉన్న దర్శకులకు సినిమా చేసే ఛాన్స్ ఇవ్వడంలో కొంత వరకు ఆలోచిస్తారు. కానీ బాలయ్య మాత్రం వేరు. కథ నచ్చితే దర్శకుడి గత రిజల్ట్స్ ను పెద్దగా పట్టించుకోరని తెలిసిందే.టాలెంట్ ను నమ్మి అవకాశాలు ఇవ్వడం బాలయ్య స్టైల్. ఆ కారణంతోనే ఇప్పుడు హరీష్ శంకర్ కు ఛాన్స్ దక్కినట్లు తెలుస్తోంది. మరో విషయమేమిటంటే ఇప్పుడు హరీష్ శంకర్.. ఉస్తాద్ భగత్ సింగ్ మూవీతో బిజీగా ఉన్నారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో చేస్తున్న ఆ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. మంచి హిట్ గా నిలిస్తే హరీష్ కు మళ్లీ మాస్ డైరెక్టర్ గా స్ట్రాంగ్ రీఎంట్రీ దక్కే అవకాశం ఉంది. అప్పుడు బాలయ్య ప్రాజెక్ట్ కూ మరింత బూస్ట్ వచ్చే ఛాన్స్ ఉంది. మార్కెట్, బిజినెస్ పరంగా కూడా హైప్ పెరుగుతుందనే చెప్పాలి. ఏదేమైనా బాలయ్య- హరీష్ శంకర్ కాంబో నిజమైతే మాస్ ప్రేక్షకులకు పండగే. పవర్ ఫుల్ డైలాగులు, యాక్షన్ ఎలిమెంట్స్, ఎమోషన్స్ తో పక్కా కమర్షియల్ ఎంటర్టైనర్ మూవీ రూపొందే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో అఫీషియల్ అనౌన్స్మెంట్ కోసం అభిమానులు ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు.



Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001.
APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343,CELL:9494741301.